


VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
రాజమండ్రి, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి మండలాలకు విలేకరులు కావలెను.
పట్టణాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 7013785256, 9959867303

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 168 విశాఖపట్నం, 15 ఏప్రిల్ 2025 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## వక్ఫ్ రూల్స్‌ను కాంగ్రెస్ తమ స్వార్థానికి మార్చేసింది


ప్రధాని నరేంద్రమోదీ

ఢిల్లీ : అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటోందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న నిరసనలపై ప్రధాని నరేంద్ర మోదీ మండి పడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో వక్ఫ్ రూల్స్‌ను తమ స్వార్థానికి మార్చేసిందని ఆరోపించారు. అధికారం కోసం పవిత్రమైన రాజ్యాంగాన్ని ఆయుధంలా వాడుకుంటూ.. ఓటు బ్యాంకు వైరస్‌ను వ్యాప్తి చేసిందని అన్నారు. ముస్లింలకు మద్దతుగా నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఎందుకు వారికి పార్టీలో ఉన్నత స్థానాలను ఇవ్వలేదని ప్రశ్నించారు. ముస్లిం అభ్యర్థులకు 50 శాతం ఎన్నికల టిక్కెట్లను ఎందుకు రిజర్వ్ చేయలేదని నిలదీశారు. హరియాణాలోని హిస్సార్ విమానాశ్రయ ప్రారంభోత్సవంలో ప్రధాని మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఈ ...(మిగతా 2లో)

# అంబేడ్కర్ విదేశీ విద్యా దీవెనకు మళ్లీ జీవం





## అంబేడ్కర్ జయంతి వేడుకలో సీఎం చంద్రబాబు

తాడికొండ, విశాఖ సమాచారం: అంబేడ్కర్ విదేశీ విద్యా దీవెనను మళ్లీ ప్రారంభిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆయన సోమవారం గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లులో పర్యటించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా వేడుకల్లో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. "కుల వివక్షకు వ్యతిరేకంగా అంబేడ్కర్ పోరాడారు. రాజ్యాంగంలో హక్కులను అంబేడ్కర్ పొందుపరిచారు. దళితులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిని లోక్‌సభ స్పీకర్‌గా చేసిన పార్టీ టీడీపీ. దళితుల హక్కులు కాపాడాలని ఆదేశాలు ఇచ్చాం. సొంతూరిలోనే బంగారు భవిష్యత్తు ఉందని యువత ప్రస్తుతం భావిస్తున్నారు. పేదలకు అండగా ఉంటానని అందరికీ హామీ ఇస్తున్నా. ప్రతిష్ఠాత్మక వర్సిటీలు అమరావతికి తరలివస్తున్నాయి. సబ్‌ప్లాన్ ద్వారా దళితుల అభివృద్ధికి కృషి చేస్తాం. రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వారికి 8 లక్షల ఎకరాలను తెదేపా ప్రభుత్వం గతంలో పంపిణీ చేసింది" అని చంద్రబాబు తెలిపారు. అంతకుముందు గ్రామంలో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అంబేడ్కర్ చిత్రపటాల ప్రదర్శనను తిలకించారు. అనంతరం పీ4 కార్యక్రమాల లబ్ధిదారులతో చంద్రబాబు సమావేశమయ్యారు. ...(మిగతా 2లో)



## అమెరికాకు చైనా షాక్!

- సుంకాల నేపథ్యంలో కీలక ఎగుమతులు నిలిపేత

బీజింగ్: చైనా కొన్ని రకాల అరుదైన ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతులను నిలిపివేసింది. దీంతో అమెరికా కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడనుంది. అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్రమైంది. అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీకండక్టర్లు కంపెనీలకు సమస్యలు ఎదురు ...(మిగతా 2లో)

## గోల్కొండ బ్లూ వజ్రం త్వరలో వేలం!

- రూ. 430 కోట్లు పలికే అవకాశం



జెనీవా: భారతదేశ రాజుల దగ్గర ఉన్న అరుదైన వజ్రం 'గోల్కొండ బ్లూ' ను వేలం వేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఇండోర్, బరోడా మహారాజుల వద్ద ఉన్న విలువైన సంపదలో ఇదీ ఒకటి. 23.24 క్యారెట్ల విలువైన ఈ వజ్రాన్ని మే 14న జెనీవాలో జరిగే " క్రిస్టీస్ మాగ్నిఫిసెంట్ జ్యువెల్స్" సేల్‌లో వేలం వేయనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వేలంలో దీని ధర దాదాపు రూ.430కోట్ల వరకు పలికే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాని రాజ వారసత్వం, అసాధారణ రంగు, పరిమాణంతో 'ది గోల్కొండ బ్లూ' ప్రపంచంలోని అరుదైన నీలి వజ్రాలలో ఒకటిగా నిలిచిందని క్రిస్టీస్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ హెడ్ రాహుల్ ...(మిగతా 2లో)

# బాణాసంచా తయారీ కేంద్రాల్లో భద్రత డొల్ల

- రాష్ట్ర వ్యాప్తంగా సేఫ్టీ ఆడిట్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం
- 'కైలాసపట్నం' ప్రమాదంలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి





- వివరాలు 2 లో

## నిండు గర్భిణి దారుణ హత్య

- విశాఖలో భర్త అఘాయిత్యం
- కొన్ని గంటల్లో డెలివరీ కావలసిన భార్యను గొంతు నిలిపి చంపిన కిరాతకుడు

విశాఖపట్నం, విశాఖ సమాచారం : విశాఖలో దారుణం జరిగింది. మరి కొన్ని గంటల్లో ప్రసవం కావాల్సిన భార్యను భర్తే గొంతు నులిమి చంపాడు. తప్పించుకునేందుకు పథకం వేశాడు. ఆపై దారుణానికి ఒడిగట్టింది తానేనని నిజం ఒప్పుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు.. పీఎం పాలెం ఉడా కాలనీలో జ్ఞానేశ్వర్, అనూష దంపతులు నివాసం ఉంటున్నారు. రెండేళ్ల కిందట ...(మిగతా 2లో)



## 91 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ!



విశాఖపట్నం, విశాఖ సమాచారమ్ : చదువుపై ఆసక్తి.. చదవాలనే పట్టుదల ఉంటే వయసుతో సంబంధం లేదని నిరూపించిన వారు అతి కొద్దిమందే ఉంటారు. గతంలో అమెరికాలో నివసించిన ప్రవాసాంధ్రుడు డాక్టర్ నూకల సూర్య నారాయణ (ధనం) ఆ ...(మిగతా 2లో)

## ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని భారత్‌కు తెచ్చేందుకు యత్నాలు



ఢిల్లీ : ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని భారత్‌కు రప్పించేందుకు ఉన్న ఏ అవకాశాన్ని వదల కూడదని ప్రభుత్వం నిర్ణయించుకొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో చట్టపరంగా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వాడుకోవాలని భావిస్తోంది. ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్లవార్తా ఛానెల్ ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు ఛోక్సీకి చెందిన న్యాయవాద బృందం అతడిని భారత్‌కు తరలించకుండా తీవ్రంగా యత్నిస్తోంది. ఈ క్రమంలో భారత్‌కు న్యాయపరమైన సవాళ్లు ఎదురుకానున్నాయి. దీనికి తోడు అతడికి బ్లడ్ క్యాన్సర్ ఉండటంతో ...(మిగతా 2లో)



# చిత్తూరులో పరువు హత్య!

**చిత్తూరు:** ఏపీలోని చిత్తూరు జిల్లాలో పరువు హత్య జరిగినట్టుగా పోలీసులు అనుమనిస్తున్నారు. చిత్తూరు పట్టణానికి చెందిన యాస్మిన్ భాను.. అదే జిల్లాలోని పూతలపట్టుకు చెందిన సాయితేజను ప్రేమించింది. ఇరు కుటుంబాలు వీరి వివాహానికి ఒప్పుకోకపోవడంతో గత ఫిబ్రవరిలో ఇద్దరూ ఇంట్లోంచి వెళ్ళిపోయి నెల్లూరులో వివాహం చేసుకొని అక్కడే నివాసం ఉంటున్నారు. కాగా ఇటీవల తండ్రికి సీరియస్ గా ఉందని కుటుంబ సభ్యులు ఫోన్ చేయడంతో యాస్మిన్ ఇంటికి వెళ్ళింది. అయితే ఆ మరుసటి రోజే యాస్మిన్ అనుమానాస్పదరీతిలో మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టగా.. ప్రేమ వివాహం చేసుకొని పరువు తీసావని తండ్రి తిట్టడంతో, మనస్తాపం చెంది రాత్రి తన గదిలో ఉరి వేసుకుందని తల్లి పోలీసులకు స్టేట్మెంట్ ఇచ్చింది. అయితే ఆ గదిలో ఉరి వేసుకున్న ఆనవాళ్ళు ఏమీ లేకపోవడంతో అనుమానించిన పోలీసులు యస్మిన్ తల్లిని, సోదరిని అదుపులోకి తీసుకున్నారు. తండ్రితో పాటు పలువురు బంధువులు పరారీలో ఉన్నారు. వారికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసును పరువు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు చిత్తూరు పోలీసులు పేర్కొన్నారు.

# నిండు గర్భిణి దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. జ్ఞానేశ్వర్ సాగర్ నగర్ వ్యూ పాయింట్ వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. భార్య అనుష గర్భవతి. మంగళవారమే డెలివరీ కావాల్సి ఉంది. ఈ తరుణంలో సోమవారం ఉదయం ఆమెకు ఆరోగ్యం బాగోలేదని భర్త కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు విగత జీవిగా ఉన్న అనూషను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అనూష మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనూష మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. భర్త జ్ఞానేశ్వర్ తీరుపై పోలీసులు అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. పోలీసుల విచారణలో తనకు, తన భార్య అనుషకు మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో భార్య అనుషను గొంతు నులిమి హత్య చేసినట్లు పీఎం పాలెం పోలీసులు ఎదుట ఒప్పుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జ్ఞానేశ్వర్ ను కఠినంగా శిక్షించాలని , మరో అమ్మాయికి ఇటువంటి పరిస్థితి రాకూడదని అనూష తల్లి, స్నేహితులు. కన్నీళ్లతో వేడుకుంటున్నారు.

# గోల్కొండ బ్లూ వజ్రం త్వరలో వేలం!

(మొదటి పేజీ తరువాయి)

కడాకియా ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కొల్లూరులో ఈ వజ్రం లభ్యమయినట్లు తెలుస్తోంది. పూర్వం ఇండోర్‌ను పరిపాలించిన మహారాజా యశ్వంత్ రావు హెూల్కర్-II వద్ద ఇది ఉండేది. 1923లో మహారాజా తండ్రి దీనిని ఓ బ్రాస్‌లెట్‌లో పొదిగించారు. అనంతరం ఆభరణాలను రీడిజైన్ చేయడంలో భాగంగా ఇండోర్ పియర్ వజ్రాలతో చేసిన నెక్లెస్‌లో 'ది గోల్కొండ బ్లూ'ను అమర్చారు. ఫ్రెంచ్ చిత్రకారుడు బెర్నార్డ్ బౌటెట్ డి మోన్వెల్ అప్పట్లో గీసిన ఇండోర్ మహారాణి చిత్రపటంలో ఆమె ధరించిన ఆభరణాలలో ఈ వజ్రం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 1947లో ఈ వజ్రాన్ని ప్రఖ్యాత న్యూయార్క్ ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్స్టన్ కొనుగోలు చేశాడు. తర్వాత అది బరోడా మహారాజు వద్దకు చేరుకుంది. అనంతరం దీనిని ఓ ప్రైవేటు సంస్థ సొంతం చేసుకుంది.

# అంబేద్కర్‌కు వైఎస్ జగన్ నివాళి




**తాడేపల్లి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం అంబేద్కర్‌కు వైసీపీ అధినేత వైఎస్ జగన్ నివాళి అర్పించారు. అంబేద్కర్ ఆశయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా జగన్ ట్విట్టర్ వేదికగా..'రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అణగారిన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారు. సమానత్వం, సాధికారతను అందించారు. మన పరిపాలనలో అంబేద్కర్ ఆశయాలతో ముందడుగు వేశాం. రాష్ట్రంలోని అణగారిన వర్గాలకు గౌరవం, న్యాయం అందించడానికి ఎప్పుడూ పని చేస్తాం. అంబేద్కర్ ఆశయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం. ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాం' అని అన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం సతీమణి




**తిరుమల, విశాఖ సమాచారం :** కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. వేకువ జామున శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. శ్రీవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పవన్ కల్యాణ్, అన్నా లెజినోవా చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్ స్కూలులో జరిగిన అగ్ని ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు సింగపూర్‌లో అతనికి చికిత్స అందించారు. అనంతరం కుమారుడిని తీసుకొని ఆదివారం పవన్ దంపతులు హైదరాబాద్ చేరుకున్నారు. తన కుమారుడు కోలుకోవడంతో మొక్కులు చెల్లించుకోవడానికి అన్నాలెజినోవా ఆదివారం తిరుమలకు వచ్చారు.

**అన్నదానం ట్రస్ట్‌కు విరాళం**

టీటీడీ ఎస్వీ అన్నదానం ట్రస్ట్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా విరాళం ఇచ్చారు. తమ కుమారుడు మార్క్ శంకర్ పేరుతో రూ.17లక్షల చెక్కును అధికారులకు అందజేశారు. సోమవారం మధ్యాహ్నం అన్నవితరణకు అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చారు.

# అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనకు మళ్లీ జీవనం

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శులు, బంగారు కుటుంబం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో సీఎం మాట్లాడి కష్టసుఖాలు తెలుసుకున్నారు. "విదేశీ విద్యాదీవెన కోసం గతంలో రూ.467 కోట్లు ఖర్చు చేశాం. కానీ, వైకాపా హయాంలో కేవలం 437 మందికే అవకాశం కల్పించారు. ఎస్సీల ఆదాయం పెంచే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నాం. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు పేదలను ఆదుకోవాలి. విజన్ 2047 ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కోసం కృషి చేస్తున్నాం. ప్రపంచంలో చాలా మంది తెలుగువారు ఉన్నారు. ప్రవాసాంధ్రులు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలి. మార్గదర్శి, బంగారు కుటుంబంలో అందరూ భాగస్వాములు కావాలి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన కోసం పీ4 తెచ్చాం. ప్రైవేటు భాగస్వామ్యంతో పేదల జీవితాలు మార్చడం కోసం పనిచేస్తున్నాం. పొన్నెకల్లులో ఇంకా 300 మందికి మరుగుదొడ్లు లేవు, 6 నెలల్లో నిర్మిస్తాం. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం" అని చంద్రబాబు అన్నారు.

**ప్రసంగంలో చంద్రబాబు తడబాటు**

అంబేద్కర్ జయంతి సభలో సీఎం చంద్రబాబు తడబడ్డారు. 2014-2019లో ప్రజలు ఆనందంగా కూర్చొని నవ్వుకున్న సందర్భాలు ఉన్నాయా? అని ప్రజలను ప్రశ్నించారు. నా చరిత్రలో ఎప్పుడు చూడని రాజకీయం 2014-2019లో చూశానని అన్నారు. ఆ సమయంలో పక్కనే ఉన్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అప్రమత్తమయ్యారు. చంద్రబాబు వద్దకు వచ్చి అసలు విషయాన్ని ఆయన చెవిలో ఊదారు. వెంటనే తేరుకున్న చంద్రబాబు సారీ సారీ అంటూ తడబాటును సరిదిద్దుకున్నారు. ఎప్పుడూ చూడని భయంకర రాజకీయాన్ని 2019-24 మధ్య చూశానని అన్నారు. చివరకు తాను కూడా బయటకు రాలేని పరిస్థితి కల్పించారని ధ్వజమెత్తారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్న ప్రభుత్వం తమదని చంద్రబాబు చెప్పుకొచ్చారు.

**కాన్వాయ్ ఆపి చిన్న దుకాణానికి వెళ్లిన సీఎం**

గుంటూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటిస్తు క్రమంలో పొన్నెకల్లులో సీఎం చంద్రబాబు అకస్మాత్తుగా ఓ చిన్న దుకాణం వద్ద ఆగారు. అక్కడ ఉన్న మహిళతో కుటుంబం, జీవనోపాధి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి దుస్థితిని విని చలించిపోయిన ముఖ్యమంత్రి.. వారికి ఉపాధి కల్పించే ఏర్పాట్లు చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అలాగే చంద్రబాబు ఓ దళిత కుటుంబానికి ఊహించని ఆనందం పంచారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించిన చంద్రబాబు.. అక్కడ ప్రవీణ్ అనే యువకుడి మెకానిక్ షెడ్డును సందర్శించారు. అనంతరం అతని ఇంటికి వెళ్లారు. యువకుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బైక్ మెకానిక్‌ల సమస్యలను ప్రవీణ్ ద్వారా తెలుసుకున్న సీఎం.. అతడికి మంచి శిక్షణ ఇచ్చి, మెరుగైన వసతులతో గ్యారేజ్ ఏర్పాటుకు ఆర్థిక సాయం చేయాలని అధికారులు, స్థానిక నేతలకు సూచించారు. ఇల్లు కూడా మంజూరు చేయాలని ఆదేశించారు.

# అమెరికాకు చైనా షాక్!

(మొదటి పేజీ తరువాయి)

కానున్నాయి. ఎగుమతులకు సంబంధించిన నిబంధనలను చైనా రూపొందిస్తోంది. అప్పటి వరకు చైనా పోర్టుల నుంచి మాగ్నెట్‌ల ఎగుమతులను నిలిపివేశారు. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ కథనంలో పేర్కొంది. ఈ నిబంధనలు అమల్లోకి వస్తే కొన్ని కంపెనీలకు శాశ్వతంగా వీటి సరఫరా నిలిచిపోనుంది.

**చైనా నుంచి దిగుమతులే కీలకం..**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలు పెట్టిన వాణిజ్యయుద్ధానికి ప్రతి స్పందనగానే కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90శాతం చైనా నుంచే వెలుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి బీజింగ్ వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించింది. అప్పటికే చైనా ఉత్పత్తులపై 54శాతం టారిఫ్‌లను ట్రంప్ విధించారు. వీటిని కాకుండా పర్మినెంట్ మాగ్నెట్లు, ఇతర ఉత్పత్తులను కూడా నిలిపేశారు. ఈ లోటును భర్తీ చేసుకోవడం అగ్రరాజ్యానికి ఇబ్బందికరంగా మారనుంది. అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు మరింత ముదిరితే ఇలాంటి చర్యలు చేపడతామని బీజింగ్ ఎప్పటి నుంచో హెచ్చరిస్తోంది.

**ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలపై..**

చైనా తాజాగా చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపై ఉండనుంది. కీలక ఖనిజాల మైనింగ్, ప్రాసెసింగ్‌లో చైనా తనకున్న శక్తిని ఆయుధంగా వాడుతోంది. దీంతోపాటు ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్‌మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాల కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు.

# బాణాసంచా తయారీ కేంద్రాల్లో భద్రత డొల్ల

**అనకాపల్లి/ కోటవురట్ల (విశాఖ సమాచారం బ్యూరో):** దేశ వ్యాప్తంగా బాణ సంచా తయారీ కేంద్రాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా తగిన భద్రతా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రమాదాలు జరిగినపుడు హడావుడి చేయడం.. నష్ట పరిహారాలు చెల్లించడం.. అంతటితో తమ పనిఅయిపోయిందన్నట్లు ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరించడం సర్వసాధారణం అయిపోయింది. ఇలాంటి ప్రమాదకరమైన ఫ్యాక్టరీల్లో ఎలాంటి భద్రతా ఏర్పాట్లు లేకుండానే కార్మికులు పనిచేస్తుండడం వల్లే తరచూ ప్రాణనష్టం జరుగుతోంది. తాజాగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించడంతో మరోసారి అందరూ ఉలిక్కిపడ్డారు. ఈ దుర్ఘటనలో ఇప్పటి వరకు 8 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 18 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం క్షతగాత్రులు నర్సీపట్నం, విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా బాణాసంచా తయారీ కేంద్రాల్లో సెఫ్టీ ఆడిట్ చేయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. బాణాసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలపై త్వరలోనే విచారణ జరిపిస్తామని హెూంమంత్రి అనిత వెల్లడిరచారు.

**మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి**

బాణసంచా పేలుడు ఘటనలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యింది. నర్సీపట్నం ప్రభుత్వాసుపత్రిలో ఆరు, అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ప్రమాదంలో క్షతగాత్రులకు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో గాయపడిన 8 మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుల్లో ఇద్దరికి నర్సీపట్నం ఆసుపత్రిలో, నలుగురికి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు.

కైలాసపట్నం బాణసంచా పరిశ్రమ వద్ద సోమవారం అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఇంకా ఏమైనా బాణసంచా సామగ్రి మిగిలిపోయిందేమోనని పరిశీలించారు. అక్కడక్కడ చిన్నగా వస్తున్న పొగలను సిబ్బంది ఆర్పారు. మిగిలిపోయిన బాణసంచాను భూమిలో పాతిపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు.

**వీల్కెనంత త్వరగా పరిహారం: హెూంమంత్రి**

అనకాపల్లి ప్రమాదంపై హెూంమంత్రి వంగలపూడి అనిత మరోసారి స్పందించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందని పేర్కొన్నారు. రౌండ్ ది క్లాక్ అధికారులు ఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించారని తెలిపారు. అదేవిధంగా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.15 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిందని, వీల్కెనంత త్వరగా బాధిత కుటుంబాలకు పరిహారం అందజేస్తామని వెల్లడిరచారు. ప్రభుత్వ ఖర్చులతో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. సంఘటన ప్రదేశాన్ని హెూం మంత్రి వంగలపూడి అనిత, పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా సందర్శించారు. సంఘటన జరిగిన సమాచారం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రమాద స్థలానికి చేరుకొని పేలుడుకు కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ దురదృష్టకర సంఘటన పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని, సహాయక చర్యలపై ఆరా తీశారని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారని హెూంమంత్రి తెలిపారు. పాథమిక సమాచాం ప్రకారం బాణసంచా తయారీ కేంద్రానికి అనుమతులు ఉన్నాయని, 2026 వరకు ల్కెసెన్స్ పొందినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కర్మాగారంలో 16 మంది పని చేస్తున్నారని, వారిలో 8 మంది చనిపోయారని, 8 మంది గాయపడ్డారన్నారు. మందుగుండు తయారీ సమయంలోనే ఒత్తిడి గురై పేలుడు సంభవించినట్లు తెలియజేశారని, ప్రమాద సంఘటనపై పూర్తి విచారణకు ఆదేశించామని క్లూస్ టీం, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరిస్తున్నారని, విచారణ అనంతరం పేలుడు జరుగుటకు గల కారణాలు తెలుస్తాయని హెూంమంత్రి తెలిపారు.

**క్షతగాత్రులకు రూ. లక్ష ఎక్స్ గ్రేషియా**

కోటవురట్ల మండలం కైలాసపట్నం బాణాసంచా తయారీ కేంద్రలో జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులకు లక్ష రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇస్తామని హెూం మంత్రి వంగలపూడిఅనిత ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం కూడ క్షతగాత్రులకు 50 వేలు ఎక్స్ గ్రేషియా ప్రకటించిదన్నారు. అనకాపల్లి గుండాల కూడలి ఎస్.ఆర్. శంకరణ్ సమావేశ మందిరం వద్ద ఆమె సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. క్షతగాత్రుల వైద్యపరమైన ఖర్చులన్ని ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తెలిపారు. కైలాసపట్నం బాణాసంచా తయారీ కేంద్రం ప్రమాదంపై విచారణ కొనసాగుతోందని ప్రాథమిక విచారణలో ఉండాల్సిన మెటీరియల్ కన్నా ఎక్కువ మేటీరియల్ ఉందని అధికారులు నిర్ధారించారన్నారు పూర్తి నివేదిక వచ్చిన తర్వాత చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. జిల్లాలో 40 వరకు బాణాసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయని వాటిలో 21 తయారీ కేంద్రాలకు మాత్రమే ల్కెసెన్స్ ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాణసంచా తయారి కేంద్రాలపై అధ్యయనం చేస్తున్నాం.. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.. రాష్ట్రంలో ఎన్ని బాణసంచా తయారీ కేంద్రాలు ఉన్నాయి, వాటిలో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా అన్న దాని పై కమిటి వేసి విచారణ జరిపిస్తాం అని మంత్రి తెలిపారు. కైలాసపట్నం బాణాసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించిదని, ప్రభుత్వ యంత్రాంగం అంతా అక్కడ ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించిందని ఆమె తెలిపారు. సాధారణంగా అగ్ని ప్రమాదం జరిగిన ఘటనలో మృతుల కుటుంబాలకు ఐదు లక్షల పరిహారం ఇస్తాం కాని 15 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించామని, వీల్కెనంత త్వరగా మృతుల కుటుంబ సభ్యులకు పరిహారం అందజేస్తామన్నారు. మృతుల దహన సంస్కార ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఆమె తెలిపారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో మృతులకు కోటి రూపాయలు ప్రకటించిన వైసిపి ప్రభుత్వం, ఇప్పటి వరకు వారికి పరిహారం అందజేయలేదని, ఎల్జీ పాలిమర్స్ ఘటనలో బాధితులను అప్పటి ముఖ్యమంత్రి ఎలా పరామర్శించారో అందరికి తెలుసని విమర్శించారు. మీడియా సమావేశంలో అనకాపల్లి శాసన సభ్యుడు కొణతల రామకృష్ణ, రాష్ట్ర గవర, గృహ నిర్మాణ కార్పొరేషన్ల చైర్మెన్లు బత్తుల తాతయ్య బాబు, మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 91 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ!

(మొదటి పేజీ తరువాయి)

కోవకే చెందుతారు. 91 ఏళ్ల వయసులో వియత్నాం యూనివర్సిటీ నుంచి ఆయన పీహెచ్‌డీ పట్టా పొంది ఔరా అనిపించారు. డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ఇన్ ఫిలాసఫీ (డిలిట్) చేసిన సూర్యనారాయణ ఎందరికో స్ఫూర్తిదాయకం. 1954లో గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత పెట్రోలియం రిఫైనింగ్ ఇండస్ట్రీలోకి సూర్యనారాయణ అడుగుపెట్టారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, బహ్రెయిన్, కువైట్, ఒమన్ దేశాల్లో ఆయన పనిచేశారు. ఆపరేషన్స్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంటి హెూదాల్లో సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారు. పదవీ విరమణ తర్వాత 77 ఏళ్ల వయసులో ఫిలాసఫీ సబ్జెక్టులో మాస్టర్స్ పూర్తిచేశారు. 'మానవ విలువలు-సంబంధాలు' అనే అంశంపై తత్వశాస్త్రంలో సూర్యనారాయణ పరిశోధనలు కొనసాగించారు. 2015లో 81 ఏళ్ల వయసులో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందారు. ఈ పరిశోధనలో మానవ విలువల ప్రధాన భావనను గుర్తించారు. ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక, సమకాలీన కాలాలపై అధ్యయనం చేశారు. 2013లో పీహెచ్‌డీ చేసేందుకు వియత్నాం నేషనల్ యూనివర్సిటీని ఆయన సంప్రదించగా అనుమతి లభించింది. 'నిర్ణయవాదం- స్వేచ్ఛా సంకల్పం-తాత్విక సమీక్ష' అంశంపై సూర్యనారాయణ పీహెచ్‌డీ చేశారు. నమ్మకాలు, విభిన్న అభిప్రాయాలు, నైతిక బాధ్యతల భావనలపై తత్వవేత్తల మధ్య వాదప్రతివాదాలను వివరంగా పరిశీలించారు. వేదాంత దృక్పథాలు, వివిధ మత విశ్వాసాలు ఈ వాదాన్ని ఎలా పరిష్కరించాయో లోతైన పరిశోధన చేశారు. 91 ఏళ్ల వయసులో పీహెచ్‌డీ చేయడం సంతోషంగా, ఛాలెంజింగ్‌గా ఉందని సూర్యనారాయణ అన్నారు. దేవుడు తనకు ఆరోగ్యాన్ని ప్రసాదించాడని.. శేష జీవితాన్ని దక్షిణ భారతదేశంలో ఓ సీనియర్ సిటిజన్ కమ్యూనిటీలో సంతోషంగా జీవిస్తున్నానని తెలిపారు. కెరీర్, పీహెచ్‌డీలు, పరిశోధనల పరంగా ఇప్పటి వరకు సాధించిన విజయాలతో సంతృప్తిగా ఉన్నానన్నారు.

# వక్ఫ్ రూల్స్‌ను కాంగ్రెస్ తమ స్వార్థానికి మార్చేసింది

(మొదటి పేజీ తరువాయి)

విమానాశ్రయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆయన పాటించిన విధానాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయన్నారు. కానీ.. దేశ ప్రజల కోసం ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్ అధికారం పొందేందుకు ఒక సాధనంగా వాడుకుంటోందని విమర్శించారు. ఇందిరాగాంధీ హయాంలో అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో అధికారాన్ని నిలుపుకోవడానికి రాజ్యాంగ స్ఫూర్తిని హత్య చేశారని దుయ్యబట్టారు. రాజ్యాంగ విలువల గురించి ప్రసంగాలు చేసే ప్రతిపక్ష నాయకులు ఎప్పుడూ వాటిని పాటించలేదని అన్నారు. పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. కాగా కేంద్రం తీసుకొచ్చిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మొత్తం 15 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. మరోవైపు వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికల్స్‌ను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో ముస్లింలు దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన ఆందోళనల్లో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు అదుపుతప్పడంతో 110 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని భారత్‌కు తెచ్చేందుకు యత్నాలు

(మొదటి పేజీ తరువాయి)

బెయిల్‌కు కూడా తీవ్రంగా ప్రయత్నించవచ్చు. "మా క్లయింట్ పారిపోయే ప్రమాదం లేదు. అతడి ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. అతడు క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నాడు" అని అతడి లాయర్ విజయ్ అగర్వాల్ పేర్కొన్నారు.

**అప్పగింత ప్రక్రియ మొదలైనట్లేనా..?**

ఛోక్సీ విషయంలో 2022లో భారత్ ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీస్‌ను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. అప్పట్లో అతడి న్యాయవాదులు కమిషన్ ఫర్ ది కంట్రోల్స్ ఆఫ్ ఇంటర్‌పోల్స్ ఫైల్స్ (సీసీఎఫ్)ను ఆశ్రయించారు. తమ క్లయింట్‌ను భారత్‌కు అప్పగిస్తే అతడి మానవ హక్కులను ఉల్లంఘించడంతో.. రాజకీయ వేధింపులకు పాల్పడతారన్నారు. భారత్‌కు అప్పగిస్తే వేధింపులకు ఆయుధంగా వాడుకొంటారన్నారు. దీంతో సీసీఎఫ్ రెడ్‌కార్నర్ నోటీస్‌ను తొలగించాల్సివచ్చింది.

దీంతో భారత ప్రభుత్వం మరో మార్గాన్ని ఎంచుకొంది. ఛోక్సీపై ఇప్పటికే భారత అధికార యంత్రాంగం కనీసం రెండు ఓపెన్ ఎండెడ్ అరెస్ట్ వారెంట్లను అక్కడి అధికారులతో పంచుకొన్నాయి . వీటిని ముంబయి ప్రత్యేక న్యాయస్థానం 2018, 2022లో జారీ చేసింది. ఇది నేరగాళ్ల అప్పగింత ప్రక్రియలో మొదటి అడుగు. తాజాగా వారెంట్ ఆధారంగానే బెల్జియంలో అతడిని అరెస్టు చేశారు. దీంతో రెడ్‌కార్నర్ నోటీస్ ఒక్కటే అతడి అరెస్టుకు మార్గం కాదని భారత్ చెప్పినట్టైంది.

అతడి అరెస్టుతో అప్పగింత ప్రక్రియకు మార్గం సుగమం అయింది. దీనికి సంబంధించిన పేపర్ వర్క్ జరుగుతోంది. ఈ క్రమంలో న్యాయస్థానాల్లో జరిగే పోరాటాల ఆధారంగా అతడు ఎంత వేగంగా భారత్‌కు వస్తాడనే అంశం ఆధారపడింది.

## శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) అందజేశారు. ముందుగా ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి షేక్ ఆయిషా,సహాయ కమిషనర్ ఆలయ ఈవో వెంపల్లి రాంబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లసురేంద్ర, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్,దాడి రవికుమార్, పొలిమేర. ఆనంద్, మారిశెట్టి. శంకర్రావు,కాండ్రేగులరాజారావు, మజ్జి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి, ఎర్రవరపు లక్ష్మి , దేవస్థానం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## గజ్జరంలో ఘనంగా అంబేద్కర్ బహుజన భోజనాలు



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామంలో డాక్టర్ భీమ్ రామ్ అంబేద్కర్ జయంతి వేడుకలు పురస్కరించుకొని గజ్జరం గ్రామ కాలనీలో అంబేద్కర్ యూత్ బహుజన భోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది

ఈ కార్యక్రమంలో గూడా నాగరాజు, దేశా బత్తుల చందు, మడతల రాజు, కర్రీ వంశీ, ఇనపాల సూరి, కండెల్లి జగదీష్, గూడా బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కులు, చట్టాల అమలకు పోరాటాలు చేస్తాం



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకులోయ పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర , జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ భారత దేశంలో పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలు వలన రాజ్యాంగంలో ఉన్న ఫెడరల్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని రాష్ట్రాల హక్కులను కాలరస్తున్నారని రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు వుండాలని దేశం లో సమగ్ర అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారని కానీ స్వేచ్ఛ స్వతంత్ర్య భారతంలో దళితులు, ఆదివాసులు మైనారిటీలు ఇతర బలహీన వర్గాలు వెనకబడే ఉన్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో ఆదివాసులకు జీఓ నెంబర్-3 నూరు శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 8 కేబినెట్ సమావేశాలు నిర్వహించారని కనీసం ఆ దిశగా చర్చించలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నూరు శాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాలని, గత ప్రభుత్వం అసెంబ్లీలో బోయ వాల్మీకిలను ఎస్టీ జాబితలో చేరుస్తూ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలి. ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అనుమతుల పేరుతో నిలిచిపోయిన రోడ్లను అనుమతులు ఇవ్వాలి. పెండింగ్ ల్లో ఉన్న పోడు భూమి పట్టాలు పంపిణీచేయాలి.ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కిల్లో జగనాధం కొర్రా మగ్గన్న తంగుల హరి పాంగి రాము కిండంగి రామారావు జగనాధం సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరావు మండల కార్యదర్శి భగత్ రామ్ పాల్గొన్నారు.

## సిద్ధార్థనగర్‌లో అంబేద్కర్ జయంతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జివిఎంసి 22 వార్డ్ లో సిద్ధార్థనగర్ గ్రామంలో సిద్ధార్థనగర్ యువ జన సేవాసంగం ఆధ్వర్యంలో సోమవారం భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విశాఖపట్నం ఎంపీ భరత్, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, టీడీపీ నాయకులు బొట్టా రమణ, 22డ్ వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ పీతల గోవింద్, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొద్దు.కళ్యాణరావు తదితరులు ముఖ్య అతిధులుగా రావటం జరిగింది.

## 17న డిఎన్ఎఫ్ సమావేశం

**పాడేరు/జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లా లాభాపేక్ష లేని పోరం (డిఎన్ఎఫ్) మొదటి సమావేశం ఈనెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది నవంబర్ 29న జరిగిన ఈ సమావేశం ఫలవంతంగా జరిగిందని పేర్కొన్న కలెక్టర్ ఈ సమావేశం ద్వారా జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం అందరూ భాగస్వామ్యంతో మెరుగైన సమన్వయ సహకారాలతో, అభివృద్ధి ప్రయత్నాలు పెంపొందించడం లక్ష్యంగా ఈ వేదిక ఉపయోగపడు తుందని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశానికి ఎన్జీవో సంఘాల ప్రతినిధులు, సి ఎస్ ఆర్ అమలు చేయు సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కలెక్టర్ కోరారు. మరిన్ని వివరాల కోసం చైతన్య రెడ్డిని 7702029434 నంబర్లో సంప్రదించవచ్చు అని తెలిపారు.

# రిజర్వేషన్లు కల్పించిన ఘనత అంబేద్కర్‌దే : హోం మంత్రి వంగలపూడి అనిత




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా సోమవారం అనకాపల్లి పట్టణం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, అనకాపల్లి శాసనసభ్యులు కొణతల రామకృష్ణ, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎమ్ జాహ్నవి తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అధ్యక్షతన నిర్వహించిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలకు హోం మంత్రి ముఖ్య అతిదిగా హాజరయ్యారు. కార్యక్రమనికి ముందుగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ సమానత్వం మరియు స్వేచ్ఛ కోసం నిరంతరం పరితపించిన వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని మనకోసం రూపొందించారని అన్నారు. నేడు బడుగు బలహీన వర్గాలకు విద్య, సమానత్వం, రిజర్వేషన్లు, వివిధ సంక్షేమ పథకాలు, హక్కులు అందుతున్నాయంటే, అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం చలవేనని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేసి, స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందడుగు వేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్ జాహ్నవి, అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ అయిషా, జిల్లా షెడ్యూల్డ్ కులముల మరియు సాధికారిత అధికారి కె రాజేశ్వరి, రాష్ట్ర హౌసింగ్, గవర కార్పొరేషన్ ఛైర్మెన్లు బత్తుల తాతయ్య బాబు, మళ్ల సురేంద్ర, వివిధ మండలాల సంక్షేమ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎస్సీ సంఘాల నాయకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు.

# అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన విశాఖ ఎంపీ భరత్



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):-** భారత రత్న, డా.,బాబా సాహెబ్, బి, ఆర్, అంబేద్కర్, 134 వజయంతి వేడుకలు సందర్భంగా 12,వ వార్డు, పెదగదిలి జంక్షన్ లో ఉన్న, అంబేద్కర్ విగ్రహం నకు ముఖ్య అతి ధిలుగా విచ్చేసి న, విశాఖ పార్లమెంట్ సభ్యులు, గీతం యూనివార్సిటీ అధ్యక్షులు, ముతుకుమిల్లి శ్రీ భరత్, విశాఖ తూర్పు శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఒమ్మి సన్యాసి రావు, గొంప కృష్ణలు పాల్గని పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించిరి అనంతరం కేక్ కట్ చేసి, వేడుకులజరుపుకొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుచు, అంబేద్కర్ ఈ దేశానికి రాజ్యాంగం అందించిన మహనీయుడు అనీయు, ఆయన చూపించిన మార్గం లో పయనించి అందరు చదువు కోవాలనియు ఈ ప్రభుత్వం, దళితుల అభివృద్ధి కొరకు ఎస్సి కార్పొరేషన్ ద్వారా అనేక సంక్షేమ పదకాలు అమలు చేస్తున్నదనియు చెప్పిరి ఈ కార్యక్రమంలో, పార్లమెంట్, ఎస్సి సెల్ అధ్యక్షులు, బుడుమూరు గోవింద్, 12,వ వార్డు అధ్యక్షులు, గాడి సత్యం, వార్డు ఇంచార్జి ఒమ్మి అప్పలరాజు పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి, పోలరావు, పార్లమెంట్ పార్టీ సెక్రటరీ, ఏడువాక సన్యాసిరావు,నాయకులు, దువ్వి తాతారావు, దువ్వి సంతోష్, వానపల్లి గణేష్, బాధరు బాలరాజు, గెద్దవలస వెంకటరావు, సియాద్రి శ్రీను, రాయి అప్పలనాయుడు, నల్ల ఈశ్వరరావు, రాపర్తి గణపతి, లాయర్ కృష్ణ, సర్వసిద్ధి గోపి, ధనల ఈశ్వరరావు, నమ్మి గణేష్ బసవ దేముళ్ళు, బాబా,వెంకనాయుడు, దామోదర్, జ్యోతి, గుమ్మవిజయ్, తిమోతి, షారొన్, ఇల్లా లక్ష్మి, కొండమ్మ, వరలక్ష్మి,కృష్ణవేణి, రాదమ్మ, ప్రసాద్, గొలుసు రమణ, జనార్ధన్, కాయత గోవిందరావు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే మన ధ్యేయం



**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే మన ధ్యేయంగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయ సాధనకు మనందరం కలిసి కృషి చేద్దామన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ భీమ్ రావు రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించారని, ఆయన గొప్ప రాజకీయవేత్త, సామాజిక సంస్కర్త, న్యాయవాది మరియు ఆర్థికవేత్త అని కొనియాడారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మన సమాజానికి చేసిన కృషికి 1990లో భారతరత్న అవార్డుతో సత్కరించబడ్డారని తెలిపారు. వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి, సామాజిక న్యాయం, సమానత్వాన్ని ప్రోత్సహించడానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని,ఆయన మనందరికీ గొప్ప ప్రేరణ, స్ఫూర్తి అని ఆయన మార్గదర్శకంలో మనందరం కుల మత వివక్షకు తావు లేకుండా పని చేద్దాం అని సూచించారు.అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ మన జీవితాలలో చాలా ముఖ్యమైన పాత్ర పోషించారని చెప్పారు. అంతకుముందు ఐటిడిఎ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఏ ఎస్ పి ధీరజ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి, బి నాగరాజు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్ రజని, డి ఆర్ డి ఏ పి డి వి మురళి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి జనార్ధన్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

## శాసనసభ్యులు విశ్వేశ్వర రాజు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రదాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సందర్భంగా ఆ మహనీయుడికి స్మరించుకుంటూ సోమవారం పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసన సభ్యులు వైసిపి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరగాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతీయ సమాజానికి సూచించిన మార్గం దేశానికి ఒక గొప్ప ఆదర్శం అని అన్నారు. వెనకబడిన వర్గాలకు వాల హక్కులు చట్టాలు కాపాడుకోవడానికి తమ జీవితాంతం కూడా పోరాటం చేశారు, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి దాదాపు 75 ఏళ్లు దాటిన అంబేద్కర్ ఆలోచన విధానం ప్రకారం దళిత ఆదివాసి గిరిజనులు ఇంకా వెనుకబడి ఉండడానికి గల కారణాలు ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్రాల్లోని పరిపాలించిన పాలకులు అధ్యయనం చేసిన దాఖలాలు లేవు... రాజ్యాంగంలోని ప్రత్యేకంగా ఆదివాసి గిరిజనులకు చోటు కల్పించి ప్రత్యేక హక్కులు చట్టాలు కల్పించి గిరిజన షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి అలాగే అటవీ ప్రాంతాల్లో ఉన్న భూములు గిరిజన ప్రాంత ప్రజలకే చెందాలి అని ఒక ప్రత్యేక పోరాటం చేసి గిరిజనులకు ప్రోత్సహించారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, ఊర్వశిరాణి, మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ, కిల్లో కోటిబాబు నాయుడు, కొణతాల ప్రశాంత్, కూడి వలసం నాయుడు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన త్రాగునీటిని సద్వినియోగం చేసుకోండి



**జి.మాడుగుల/పాడేరు, (విశాఖ సమాచారమ్):-** వసతి గృహంలో విద్యార్థులు అక్కడ అందిస్తున్న స్వచ్ఛమైన త్రాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ కోరారు. సోమవారం పీఎంఆర్సి వద్ద గల పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్ కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించిన ఆర్ఓ ప్లాంట్ ను కలెక్టర్ డాక్టర్ తనూజ రాణి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులపై అభిమానంతో స్టేట్ బ్యాంకు వారు వితరణ చేసిన ఆర్ఓ ప్లాంట్ వల్ల నీటి కాలుష్యం లేని స్వచ్ఛమైన నీటిని అందించడం జరుగుతుందన్నారు. అయితే ఆర్ఓ ప్లాంట్ నిర్వహణను విద్యార్థులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.ఎంపీ డాక్టర్ తనూజరాణి మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించడానికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులను సిబ్బందిని అభినందించారు.

ముందుగా వసతి గృహంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ ఎంపీ పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్ రజని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## టి.టి.డి. అన్నదానం ట్రస్ట్ కు లక్ష రూపాయలు విరాళం



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):-** చిట్టివలస తగరపువలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాళ్ల గురునాయుడు పేరిట తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కి భీమిలి నియోజకవర్గం కె.జి.యన్ చారిటీబుల్ ట్రస్ట్ 100000/-రూపాయలు (లక్ష రూపాయలు) విరాళం అందజేశారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాళ్ల. శ్రీనివాస్ ట్రస్ట్ సభ్యులు కాళ్ల. సూర్య, కాళ్ల.పురుషోత్తం, మద్దిల. పద్మావతి,కాళ్ల విమల కుమారి పాల్గొన్నారు.

## శ్రీ నూకంబికను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కు తీర్థ ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) అందజేశారు. ముందుగా ఆలయ మర్యాదలు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి షేక్ ఆయిషా, సహాయ కమిషనర్ ఆలయ ఈవో వెంపల్లి రాంబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్లసురేంద్ర, ఆలయ ధర్మకర్తలుసూరే సతీష్,దాడి రవికుమార్ పొలిమేరఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగులరాజారావు, మజ్జి శ్రీనివాసరావు,కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి , దేవస్థానం సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## చినముషిడివాడ అయ్యప్పస్వామి ఆలయంలో ఘనంగా విషూ పూజ!

### భక్తులకు అయ్యప్ప విషుఖిని నాణాలు పంపిణీ



**పెందుర్తి, (విశాఖ సమాచారమ్):-** కేరళలో ఉగాది సందర్భంగా అన్ని అయ్యప్ప దేవాలయాలలో జరిగే విష పుజ సందర్భంగా సోమవారం చినముసిడివాడ 97 వార్డ్ గణేష్ నగర్ లో గలఅయ్యప్ప స్వామి దేవాలయంలో కూడా విషూ పూజ నిర్వహించడం జరిగింది. అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త అర్చకులు గంటివెంకటేశం సారథ్యంలో ప్రాత:కాలాన అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. నూతన వస్త్రాలను ధరించి ఆ తర్వాత దేవాలయానికి విచ్చేసి స్వామివారికి కూడా నూతన వస్త్రాలను సమర్పించి స్వామివారు ఇచ్చే విషుఖనిని ( డబ్బుల నాణాలు) స్వీకరించినట్లయితే ఆ సంవత్సరం మొత్తం స్వామి వారి యొక్క అనుగ్రహానికి పాత్రులై లక్ష్మీ కటాక్షానికి అర్హత పొంది ఆశీర్వదింపబడతారని అర్చకులు వెంకటేశం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు బ్రాహ్మణ సమాఖ్య నాయకులు వద్దాది ఉదయకుమార్ చేతుల మీదుగా డబ్బుల నాణేలను పంపిణీ చేశారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** అనపర్తి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యాన అగ్నిమాపక వారోత్సవాలను అనపర్తి ఎమ్మెల్యే 40 రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డిఆధ్వర్యాన స్థానిక ఫైర్ఆఫీస్ లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అమరవీరుల స్థూపం,వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. అగ్నిమాపక శాఖఆవశ్యకతను వివరిస్తూ, ప్రజల ప్రాణ రక్షణ కోసం పాటుపడినఅమర వీరుల త్యాగాలను స్మరించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అగ్ని మాపకసేవలు కొనియాడారు. అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ అగ్నిమాపక దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న నిర్వహించబడుతుందన్నారు. 1944, ఏప్రిల్ 14న ముంబాయి ఓడరేవులో జరిగిన అగ్నిప్రమాదం సంఘటన జ్ఞాపకంగా ప్రతి సంవత్సరం జాతీయ అగ్నిమాపక దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ వారం అంత జరిగే కార్యక్రమాన్ని వివరించారు అంబేద్కర్ జయంతిని పరిష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఫైర్ బృందంతో పాటు టిడిపి నాయకులు కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శేషరత్నం, దరియా ఫైర్ స్టేషన్ సిబ్బంది మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

మంగళవారం 15-4-2025


## ఇదేనా చదువునేర్పిన సంస్కారం?

కొన్ని సంఘటనలు చూసినప్పుడు మనం ఎక్కడున్నామనిపిస్తుంది. ఎంతో అభివృద్ధి చెందుతున్నామని చెప్పుకుంటున్నా.. సమాజంలో వేళ్లూనుకొనిపోయిన కొన్ని నమ్మకాలు విస్మయం కలిగిస్తాయి. ఎక్కడో మారుమూల ప్రాంతంలో జరిగిన సంఘటన కాదు ఇది. అభివృద్ధి చెందిన నగరంలో... ఉన్నత విద్య అభ్యసించి పదిమందికి విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు అమలుచేసిన ఆటవికచర్య ఆశ్చర్యం కలిగిస్తుంది. తమిళనాడులో ఈ అమానవీయ సంఘటన జరిగింది. పీరియడ్స్ వచ్చాయని ఓ విద్యార్థినిని బయట కూర్చోబెట్టి పరీక్ష రాయించింది స్కూల్ యాజమాన్యం. అవును.. పెరియార్ పుట్టిన కర్మభూమిలోనే ఈ ఘటన జరిగింది. సుబ్రహ్మణ్య భారతి పాటలు రాసిన నేల మీదే ఈ కళంకం జరిగింది. రాష్ట్రాన్ని గొప్పగా ముందుకు తీసుకెళ్తున్నాం అని గొప్పలు చెప్పే కరుణానిధి కుటుంబం పాలిస్తున్న రాజ్యంలోనే ఈ అమానుషం జరిగింది.

కోయంబత్తూరులో 8వ తరగతి చదువుతోంది ఓ దళిత విద్యార్థిని. ఏప్రిల్ 5న తొలిసారి తనకు పీరియడ్స్ వచ్చాయి. ఇలా జరిగినప్పుడు తెలుగు రాష్ట్రాల్లో జరిగినట్టే తమిళనాడులో కూడా వేడుకలు చేస్తారు. దాన్ని రకరకాల పేర్లతో పిలుచుకుంటారు. కొన్ని రోజుల పాటు పిల్లను బయటకు పంపరు. అయితే బాలిక తల్లిదండ్రులు అవేమీ ఆలోచించకుండా చదువుపాడవకూడదని, పరీక్షలు తప్పకూడదని బడికి పంపారు. ఏప్రిల్ 7న, అంటే తొలి పీరియడ్స్ వచ్చిన రెండు రోజుల తర్వాత, ఆ బాలిక ఫైనల్ ఎగ్జామ్స్ రాద్దామని స్వామి చిన్మయానంద మెట్రిక్ హయ్యర్ సెకండరీ స్కూల్‌కి వెళ్లింది. అప్పటికే ఆ బాలిక విషయం బడిలో టీచర్లకు తెలిసింది. ఆమెను లోపలికి రానివ్వకుండా బయటే ఉంచేశారు. మొట్టమొదటి పీరియడ్స్ కాబట్టి, 'తీట్టు'(తెలుగులో 'ముట్టు') అని, లోపలికి రాకుండా అడ్డుకున్నారు. పరీక్ష పోతుందని అభంశుభం తెలియని ఆ చిన్నారి కాళ్లావేళ్లా పడగా.. బయట మెట్ల మీద కూర్చోబెట్టి పరీక్ష రాయించారు.

పాపం! అమాయక పిల్ల. తనతోటి వారంతా లోపల పరీక్ష రాస్తుంటే తను మాత్రం బయట కూర్చోవడం ఎంత బాధ! పైగా పీరియడ్స్ ఉన్నాయని చెప్పి బయటకు పంపడం ఎంత అమానుషం! ఇందులో ఆ అమ్మాయి తప్పేముందు. సహజసిద్ధమైన ప్రక్రియకు ఆ బాలికకు శిక్ష విధిస్తారా? పరీక్ష కాగానే ఇంటికి వెళ్లి ఈ విషయం చెప్పింది. ఇలాంటి విషయాలను ఆధారాలతో సహా నిరూపించాలని తల్లి అనుకుంది. తర్వాత రోజు పాపను బడికి పంపి, వెనక తనూ వెళ్లింది. పరీక్ష మొదల్కైన కాసేపటికి తన ఫోన్ కెమెరాలో వీడియో ఆన్ చేసుకొని వెళ్లగా, కూతురు బయట కూర్చుని పరీక్ష రాస్తోంది. ఆ దృశ్యాన్ని రికార్డు చేసిన ఆమె విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోంది.

వీడియో సోషల్ మీడియాలో రావడంతో అందరూ ఆ స్కూల్ యాజమాన్యం మీద విమర్శలు చేస్తున్నారు. చదువుకున్న టీచర్లు విద్యార్థినిపై ఇంత దారుణంగా ప్రవర్తిస్తారా అని మండిపడుతున్నారు. కానీ కొందరు మాత్రం 'విద్యాలయాలు దేవాలయాల్లాంటివే, ముట్టులో ఉండి గుడికి వెళ్తారా? ఇది కూడా అంతే! పరీక్షకు వెళ్లకపోతే ఏమైంది? కావాలంటే మళ్లీ పరీక్షలు రాసుకునేది' అంటున్నారు. ఆ బాలిక తల్లి ఆదర్శ భావాలను, ఆమె చేసిన పనిని అనేకమంది మెచ్చుకుంటూ ఉంటే.. సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నవారూ ఉన్నారు. అన్నీ తెలిసి ఆ తల్లి కూతుర్ని ఎలా బయటకు పంపుతుందని దుయ్యపడుతున్న అభ్యుదయవాదులూ ఉన్నారు.

లోకో భిన్న రుచి.. కాదు, మూర్ఖో భిన్న రుచి.

పంచాంగం

మంగళవారం 15-4-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరము

ఉత్తరాణాయణం, వసంత రుతువు

చైత్ర మాసం

| | |
|---|---|
| తిథి | : బ. విదియ ప. 10.56 |
| నక్షత్రం | : విశాఖ రా. 3.10 |
| వర్జ్యం | : ఉ. 6.31 ల 8.19 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**

**vspnews4@gmail.com**

**వాట్సాప్ నంబర్ : 9100986585.**

## కోణార్క్ కళింగ శిల్ప చాతుర్యానికి చిహ్నం



పూరికి ఈశాన్యదిశలో ఉంది కోణార్క్ దేవాలయం.కోణ ప్లస్ అర్క్ అంటే కోణార్క్.అర్క్అంటే సూర్యుడు.ఈశాన్యం ఉన్న సూర్యుడు అని అర్థం. ఈ దేవాలయం తురుష్కులు, పోర్చుగీస్ వారి వల్ల ధ్వంసమైంది.కేవలం కోణార్క్ కళింగ శిల్పకళ రీతి చూడడానికి వెళ్లాల్సిఉంది. పురాతత్వ శాఖ వారు దీన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ దేవాలయాన్ని పురాణాల కథనం మేరకు మొదట కృష్ణుని కుమారుడు సాంబుడు నిర్మించారని తెలుస్తున్నది.సాంబుడు చేసిన అనాచారాల వల్ల నారదుడు కుష్టురోగి కమ్మని శపించాడు.అంత సాంబుడు చంద్ర భాగ నది సముద్రంలో కలిసే చోట స్నానం చేసి తపస్సు చేయగా రోగం పోయింది. సముద్రంలో సూర్యుని విగ్రహం దొరికితే కోణార్క్ లో స్థాపించారని పద్మ పురాణం చెబుతున్నది.ఆ తరువాత ఆలయాన్ని కళింగ రాజు నరసింహదేవ్ పునర్ నిర్మించారు. 1200 మంది శిల్పులు 12ఏళ్ల పాటు నిర్మించారు. క్రీ.శ.1238 నుంచి 1250 వరకూ నిర్మించారు. కోణార్క్‌లో కూడా సాంబుడు తపస్సు చేసారని, అందుకే ఇక్కడి దగ్గరలోని ప్రాంతాన్ని సాంబుడి వనం అంటారు.

24 చక్రాలతో ఏడు ఆశ్వాలతో రథం వెళు తున్నట్లు రాతి రథం చెక్కారుశిల్పులు.12 జతల చక్రాలు సంవత్సరంలో నెలలు 24 చక్రాలుగా ఉన్నాయి. చక్రంలోని 8 ఆకులు మూడు గంటల చొప్పున రోజుకు24 గంటలుగా భావిస్తారు.

వీటి మధ్యలో సన్నని బొడిపులతో కలసిన గీత లాగా ఉంది.చక్రం మధ్యలో గొడుగు పెడితే నీడ ఎక్కడ పడితే దాన్ని గంటలు,నిమిషాలు ప్రకారం లెక్కిస్తే సరైన సమయం తెలుస్తుంది.యాంటీ క్లాక్ వైజ్ చూడాలి. సూర్యుడు ఉన్నంతవరకే కాలం నిర్ణయం చేయవచ్చు. గర్భగుడి మూడువైపులా పైన సూర్యుని విగ్రహాలు ఉన్నాయి.ఉదయం సూర్యకిరణాలు పడి ఆ విగ్రహం బాలభానుడిలాగా కనిపిస్తాడు.మధ్యాన్నం సూరీడు కిరణాలు పడి మరో విగ్రహం మార్తాండుడిలా ఉగ్రంగా ఉంటాడు. సాయంత్రం మరో విగ్రహం అలసినట్లు ఉంటుంది. ఆయన ఎక్కిన గుర్రం కూడా నీరసంగా కనిపిస్తుంది.ఈ మూడు విగ్రహాలు ఎంతో ఎత్తులో ఉంటాయి.జూమ్ లెన్స్ లో చూస్తేగానీ స్పష్టంగా కనిపించవు.వీటిని బాల, కౌమారం, వృద్ధ రూపులుగా భావిస్తారు.

ఒరిస్సాలో సూర్యోదయం కోణార్క్ వద్ద మొదట కనిపిస్తుంది. 1984 ప్రపంచ వారసత్వ సంపదగా దీన్ని గుర్తించారు.విష్ణువు గజాసురుడు వధించిన తరువాత పద్మాన్ని ఇక్కడ వదిలాడని చెబుతారు. అందుకే దీనిని పద్మ క్షేత్రం అనేవారు.గర్భగుడిలో సూర్యుని విగ్రహాన్ని అయస్కాంతంతో గాలిలో నిలబడేలా శిల్పులు ఏర్పాటు చేసారు. దాంతో సముద్రంలో వెళ్లే నౌకల దిక్సూచికి ఈ శక్తిగల అయస్కాంతం అవరోధం ఉందని సరైన దారి చూపడంలేదని పోర్చుగీసువారు ఈ దేవాలయాన్ని ధ్వంసం చేసారని చరిత్రకారులు చెబుతున్నారు. 118 సంవత్సరాల నాడు గర్భ గుడిలో ఇసుక పోసి నాలుగు వైపులా గోడలు కట్టిమూసివేసారు. సందర్శకులు గుడి చుట్టూ తిరిగవచ్చుగాని పైకి ఎక్కడానికి అనుమతించరు. సూర్యదేవాలయం గోడలపై కొన్ని శిల్పాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. యువతులు హైహీల్స్, షార్ట్స్ వేసుకున్నట్లు వెయ్యి సంవత్సరాల క్రితం శిల్పులు చెక్కారు.అలాగే ఆఫ్రికా ఖండంలో ఉండే జిరాఫీలను,ఆఫ్రికన్లతో ఉన్నట్లు శిల్పాలు ఉన్నాయి.ఆనాడు జిరాఫీలు కేవలం ఆఫ్రికాలోనే ఉండేవట.ఈ దేవాలయాన్ని నిర్మించిన రాజ దంపతుల శిల్పాలు దర్శనమిస్తాయి. కృష్ణుడి గోవర్ధన పర్వతం ఎత్తిన దృశ్యం , శిఖరం పైకి రాళ్లు తరలించే క్రమంలో తాడుపట్టి మనుషులు,ఏనుగులు లాగే శిల్పాలు కనిపిస్తాయి. ఏనుగు మీద సింహం ఎక్కిన శిల్పాలు సూర్యదేవాలయం ప్రారంభంలో ఇరుపక్కలా కనిపిస్తాయి. మదం, అహంకారాలను అణచివేసే దృశ్యంగా భావిస్తారు. విశ్వామిత్ర, మేకల శిల్పాలు, స్త్రీలు కుంకుమ పెట్టుకునే శిల్పం కనిపిస్తాయి.

ఇక్కడి సూర్యుని విగ్రహాన్ని పూరీ దేవాలయం లో సూర్యనారాయణ పేర ఉప దేవాలయంలో ఉందని ఇంద్రుని విగ్రహానికి ముందు ఈ విగ్రహాన్ని ప్రతిష్టించారు. అలాగే కోణార్క్ లోని అరుణ స్తంభం కూడా జగన్నాథదేవాలయంలో ఉంది.తురుష్కుల దాడి నుంచి రక్షించేందుకు పూరీ రాజు నరసింహదేవ్ ఈ రెండిటినీ పూరీజగన్నాథ దేవాలయానికి తెచ్చి ప్రతిష్టించారు.పూరి గుడి బయట ధ్వజస్తంభం కనిపిస్తుంది.అక్కడ దీపాలు వెలిగిస్తుంటారు. అలా విలువైన వాటిని సురక్షితంగా పూరీ గుడికి తరలించారు.

సూర్య దేవాలయానికి ఎదురుగా నాట్యమండపం ఉంది.అదికూడా కేవలం గోడలతో మాత్రమే ఉంది.పైకప్పు ధ్వంసమైంది. మండపం మీద ఎక్కి చూడవచ్చు.ఈ మండపం చుట్టూ చక్కని నాట్యభంగిమలతో కూడిన శిల్పాలు కనువిందు చేస్తాయి.పైనుంచి సూర్య దేవాలయాన్ని ఏ దిక్కు నుంచి చూసినా ఒకే రకంగా గుడి ముఖద్వారం కనిపించడం స్థపతుల శిల్పచాతుర్యంగా చెప్పవచ్చు. సూర్య దేవాలయంలో ధ్యాన మందిరం ఉండేదని, ఇప్పుడు మూసివేయబడిందని చెబుతారు. దేవాలయానికి ఉన్న సప్తాశ్వాలు ఒకప్పుడు ఏడు రంగాల్లో ఉండేవని, సూర్యకిరణాలలోని ఏడు రంగులకు ప్రతీకలుగా ఉండేవని భావించేవారు. నేడు అశ్వశిల్పాలు ధ్వంసమైనాయి. వాటి రూపాలు మాత్రమే కనిపిస్తాయి. కోణార్క్ దేవాలయం ధ్వంసమైనా కళింగ శిల్ప వైభవానికి తార్కాణంగా ఆచంద్రార్కం నిలుస్తుందనడంలో సందేహం లేదు.

**యం.వి.రామారావు, 8074129668**

## ఈగలది 250 మిలియన్ సంవత్సరాల చరిత్ర



ఈగ ఇదొక చిన్న కీటకమే. కావచ్చు. ఈగలు డిప్టెరా అనే గ్రీకు మాట నుంచి వచ్చాయి. డి అంటే రెండు అని, ప్టెరాన్ అంటే రెక్కలు అని అర్థం. ఈగల ప్రధాన లక్షణం ఒక జత రెక్కలు, ఒక జత హాల్టార్స్ నీ కలిగి ఉండటమే. అయితే కొన్ని ఈగలు రెక్కలు లేకుండాకూడా జీవిస్తాయి. ఏముందని ఈగను తీసిపారేస్తాం. కానీ ఈగల గురించి తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి.

ఈగలు ఎక్కువగా మనుషుల ఆవాసాలలోనే పెరుగుతాయి. ఇవి ప్రమాదకరమైనవే. మనిషి వెంటే ఉంటూ ఆహార పదార్థాలపై వాలుతూ అంటు వ్యాధులను వ్యాపింపజేస్తాయి. వీటి నోటిలోని అవయవాలు ద్రవపదార్థ స్వాదనానికి అనుకూలంగా ఉంటాయి. ఈగలు తమ లాలాజలంతో ఘన పదార్థాలనుసైతం ద్రవపదార్థాలుగా మార్చగల శక్తి కలవి. ఈగలు పాలు, ఇతర పదార్థాలు ఉండే గ్లాసులపై తేలికగా వాలగలవు. వీటి కాళ్ళపై సన్నని రోమాలుంటాయి. అవి సామాన్య కంటికి కనిపించవు. ఇవి కొంచెం తడిగా ఉండే ఆహార పదార్థాలపైనే ఎక్కువగా వాలుతుంటాయి.

ఈగల జన్మస్థలం ఆసియా ఖండమని చెప్పుకుంటున్నా ఇవి ప్రపంచంలో అంటార్కిటికా, మరి కొన్ని దీవులను మినహాయిస్తే మిగిలిన అన్ని ప్రదేశాల్లోనూ ఉన్నాయి. ఇవి నౌకలు, రైలు, విమానాలు, ఇతర వాహనాల ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి వలస పోతుంటాయి. రెండు వందల యాభై మిలియనం సంవత్సరాల క్రితమే ఇవి భూమ్మీద ఉండటం గమనార్హం. ఈగల ఆయుష్షు ఆరు రోజులే. కొన్ని ఈగల ఆయుష్షు ఎనిమిది రోజులు. ఓ ఆడ ఈగ ఒక కాన్పులో 120 మొదలుకుని 150 వరకు గుడ్ల వరకూ పెడతాయి. ఇవి తెల్లగా నిగనిగలాడుతుంటాయి. జిగురుగా ఉంటాయి. పన్నెండు గంటల్లోనే ఈ గుడ్లు పొదగబడి ఓ దశకు చేరుకుంటాయి. ఈ దశను ప్యూపేరియం అని అంటారు. ఇది ఈగకు కవచంలా ఉంటుంది. దీని పగల గొట్టిన తర్వాతనే ఈగ తనదైన రూపంలో బయటకు వస్తుంది. ఈగలు తమ రెక్కలతో మనిషి చెవి దగ్గర చేసే రొద ఇంతా అంతా కాదు. విసిగించడంలో ఈగ తర్వాతే మరేదైనా. నిముషానికి ఓ ఈగ వెయ్యిసార్లు తన రెక్కలను రెపరెపలాడిస్తాయి అంటే ఆశ్చర్యమేస్తుంది కదూ. కానీ నిజం. సాధారణంగా ఓ ఈగ 20 మైళ్ళ దూరం వరకూ ఎగురుకుంటూ పోగలదు. సీతాకోకచిలుకల్లా ఇవి కూడా తమ కాళ్ళతో తాను తీసుకునే ఆహారం రుచిని ఆస్వాదిస్తాయి. ఈగలలో రుచిగ్రాహకాలు దేహమంతా వ్యాపించి ఉంటాయి. ఇవి ఈగల రెక్కలు, కాళ్ళు, పాదాలు, దేహం వెనుక భాగాలపైన కూడా పరుచుకుని ఉంటాయి.

ఈగ తన గుడ్లను పేడ కుప్పలు తదితర చోట్ల పెడుతుంది. ఇక్కడో విషయం గమనించాలి. ఈగలు ఎంత ప్రమాదకరమైనవంటే ఏ మాత్రం వీలున్నా మన శరీరం మీది పుండ్లలో కూడా గుడ్లను పెడతాయి. కొన్ని ఈగలు చిన్న పిల్లలముక్కు, చెవులలోకూడా గుడ్లు పెడతాయి.

మగ ఈగల కళ్ళు రెండూ దగ్గరకుంటాయి. ఆడ ఈగ కళ్ళలో ఎడమవైపు కాస్తంత ఎత్తుగా ఉంటుంది.

ఈగలు బావుల దగ్గరా, వంట గది పక్కనా, కాళ్ళు చేతులు కడుక్కునే చోట ఎక్కువగా ఉంటాయి. ఈగలు తాము తినాలనుకున్న ఆహారాన్ని వెనుక కాళ్ళతో ఎత్తి, దానిని తన ఆరు కాళ్లతో తొక్కి ముద్ద చేసి ముందున్న రెండు కాళ్ళతో నోట్లో పెట్టుకుని మింగేస్తాయి. ఈగ మనము తినే అన్నం మీద వాలినప్పుడు ఏదేని ఒక అన్నం మెతుకు మీద నల్లని చుక్క

ఒకటి పెట్టి పోతుంది. ఆ చుక్కను సూక్ష్మదర్శనితో పరీక్షిస్తే రకరకాల సూక్ష్మ జీవులు కనిపిస్తాయి. ఈ చుక్కే ఈగ విసర్జించే మలం. దానిని మనం తెలిసో తెలియకుండానే తినడంతో రోగాలు వస్తాయి. కనుక వీలున్నంతవరకూ ఈగలు వాలిన ఆహారాన్ని తినకుండా ఉండటం మంచిది. లేకుంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్టే అవుతుంది.

**- యామిజాల జగదీశ్**

## అమ్మకు సేవ




దుకాణం మధ్య లో ఓ అట్టముక్క వ్రేలాడుతూ నా దృష్టి ని ఆకర్షించింది, కుతూహలం తో దానిపై ఏమి రాయబడి ఉందోనని చూసాను, దానిమీద "అయ్యా! నా తల్లిగారికి ఆరోగ్యం సరిగ్గా లేనందున నేను ఆమె సేవ చేయుటకు సదా ఆమె దగ్గర ఉండవలసి ఉన్నది, కావున మీరు మీకు కావలసిన పళ్ళు తీసుకుని దానికి తగ్గ డబ్బు ను ఈ గల్లా పెట్టె లో వేయగలరు అని ఉంది...

నాకు ఆశ్చర్యం అనిపించింది, ఈకాలం లో కూడా ఇలాంటి అమాయకులు ఉంటారా? అని, దొంగలు ఆ గల్లా పెట్టె ను ఎత్తుకెళితే ఇతని పరిస్థితి ఏంటి? ఇతని అమాయకత్వానికి నాకు నవ్వు వచ్చింది, ఎలాగైనా ఇతనికి ఇలా చేయకూడదు అని గట్టిగా చెప్పాలి అని నిర్ణయించుకొని సాయంత్రం అతను డబ్బు తీసుకునుటకు దుకాణం కు వస్తాడు కదా అని నేను కూడా సాయంత్రం మళ్ళీ పళ్ళ దుకాణం కు చేరుకున్నాను, పళ్ళ దుకాణం యజమాని వచ్చి గల్లా పెట్టెను తీసుకుని దుకాణం కట్టి వేస్తున్నాడు.

నేను అతని దగ్గరికి వెళ్లి నన్ను నేను పరిచయం చేసుకుని నీవు ఎంత తెలివి తక్కువ పని చేస్తున్నావో తెలుసా? ఎవరైనా దొంగలు నీ గల్లా పెట్టె ను ఎత్తుకెళితే ఎలా? పళ్ళ ను ఊరికే తీసుకుపోతే ఎలా? అని మందలించబోయాను.

అందుకు అతను చిరునవ్వుతో" అంతా దైవేచ్ఛ " అన్నాడు మళ్ళీ అతనే అయ్యా! మొదట్లో నేను నా తల్లి గారితో మీలాగే అడిగాను, నేను నీ సేవలో ఉంటే దుకాణం పరిస్థితి ఎలా? అని, అందుకు మా అమ్మ "నాయనా! నాకు రోజులు దగ్గర పడ్డాయి, గోజూ నిన్ను చూడకుండా ఉండలేను, నేను ఆ దేవున్ని ప్రార్థిస్తాను, నీవు నేను చెప్పిన విధంగా చేయి, అని చెప్పింది, అమ్మ చెప్పినట్టుగానే ఆరోజు నుండి ఈవిధంగా చేస్తున్నాను అన్నాడు.

మరి నీకు ఏనాడూ నష్టం రాలేదా? అని అడిగాను కుతూహలం ఆపుకోలేక... అతను అదే చిరునవ్వుతో "నష్టమా??

ఒకసారి ఈ గల్లా పెట్టె ను చూడండి అని అతని గల్లాపెట్టె ను తెరచి చూపించాడు, ఆశ్చర్యం! గల్లాపెట్టె నిండా డబ్బు!

దుకాణం లోని పళ్ళ విలువ కంటే పదింతలు ఎక్కువగా ఉంటుంది, ఇవి చూడండి అని దుకా ణంలో రకరకాల వస్తువులు చూపాడు... వాటిలో చీరలు, బట్టలు,స్వెట్టర్లు,అప్పుడే వండుకుని తెచ్చిన పులావు, రకరకాల తినుబండారాలు..

అన్నింటిపైన "భయ్యా! అమ్మ కు మా తరపున ఇవ్వండి" అని రాసిన కాగితాలు ఉన్నాయి. అంకుల్ అమ్మను నా ఆసుపత్రి కి తీసుకురాగలరు, నేను అమ్మకు ఉచితంగా వైద్యం చేయగలను అని ఓ డాక్టర్ తన విజిటింగ్ కార్డు ను ఓ కాగితానికి కట్టి దుకాణం లో వ్రేలాడదీసి వెళ్ళాడు..

ఇదంతా చూసిన నాకు కళ్ళ వెంబడి నీళ్ళాగడం లేదు, సమాజమంతా స్వార్థం తో నిండిపోయింది, మంచితనం మచ్చుకైనా కనిపించడం లేదు అన్న నా భావన పటాపంచలైనట్టయింది.

సమాజం లో మంచితనం ఇంకా బ్రతికే ఉంది, ముందు మన దృక్పథం లో మార్పు రావాలి, తల్లికి సేవచేస్తున్నందుకు గాను సాక్షాత్తు ఆ దేవుడే స్వయంగా అతని దుకాణం కు కాపలా కాస్తున్నాడు...

ఎంతగా కోపగించుకున్నా తిరిగి మనపై కోప్పడనిది సృష్టి లో ఎవరైనా ఉన్నారంటే అదిఒక అమ్మ ఒక్కటే! అమ్మ కు చేసిన సేవ ఎప్పటికీ నిరర్థకం కాదు.

**(ఫేస్బుక్ నుండి సంగ్రహణ. రచయిత ఎవరో తెలియదు)**



## చరిత్రలో ఈ రోజు (ఏప్రిల్ 15)

**సంఘటనలు:**

1925: గోదావరి జిల్లా ను, కృష్ణా జిల్లాను విడదీసి, 15 ఏప్రిల్ 1925 తేదిన, పశ్చిమ గోదావరి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిరది. అప్పటినుండి, గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఏర్పడిన తరువాత, తూర్పు గోదావరి జిల్లాగా పేరు మార్చుకొంది. తూర్పు గోదావరి జిల్లా నుంచి విశాఖపట్నం జిల్లా ఏర్పడిరది.విశాఖపట్నం జిల్లా నుంచి, శ్రీకాకుళం జిల్లా 1950 ఆగస్టు 15 నాడు ఏర్పడిరది. విశాఖపట్నం జిల్లా లోని కొంత భాగం, శ్రీకాకుళం జిల్లా నుంచి మరి కొంతభాగం కలిపి 1979 జూన్ 1 న విజయనగరం జిల్లా ఏర్పడిరది. చూడు: తూర్పు గోదావరి జిల్లా ప్రభుత్వ వెబ్‌సైటు

1925: బ్రిటిష్ వారి కాలంలో ఈ ప్రాంతం పాలన మచిలీపట్నం కేంద్రంగా సాగింది. 1794లో కాకినాడ, రాజమండ్రిల వద్ద వేరే కలక్టరులు నియమితుల య్యారు. 1859లో కృష్ణా, గోదావరి జిల్లాలను వేరు చేశారు. తరువాత చేపట్టిన పెద్ద నీటిపారుదల పథకాల కారణంగా జిల్లాలను పునర్విభజింపవలసి వచ్చింది. 1904లో యర్నగూడెం, ఏలూరు, తణుకు, భీమవరం, నరసాపురం ప్రాంతాలను గోదావరి నుండి కృష్ణా జిల్లాకు మార్చారు. 1925 ఏప్రిల్ 15న కృష్ణా జిల్లాను విభజించి పశ్చిమ గోదావరి జిల్లాను ఏర్పరచారు. (గోదావరి జిల్లా పేరు తూర్పు గోదావరిగా మారింది) . తరువాత 1942లో పోలవరం తాలూకాను తూర్పు గోదావరి నుండి పశ్చిమ గోదావరికి మార్చారు.

2018: సీపీయస్ విధానానికి నిరసన తెలుపుటకై తెలంగాణా ఉపాధ్యాయ, ఉద్యోగులు 103 సంఘాల వారు హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో కుటుంబాలతో జనజాతర కార్యక్రమాన్ని ఉవ్వెత్తున నిర్వహించారు.

**జననాలు:**

1452: లియొనార్డో డావిన్సి, గణితజ్ఞుడు, ఇంజనీర్, చిత్రకారుడు, శిల్పకారుడు, ఆర్కిటెక్ట్, వృక్షశాస్త్రజ్ఞుడు, సంగీతకారుడు.

1469: గురునానక్, భారత ఆధ్యాత్మిక గురువు, సిక్కుమత స్థాపకుడు

1707: లియొనార్డ్ ఆయిలర్, స్విస్ గణిత శాస్త్రవేత్త.

1806: అలెక్సాండర్ డఫ్, స్కాట్లండుకు చెందిన క్రైస్తవ మిషనరీ.

1913: కరీముల్లా షా, ముస్లిం సూఫీ, పండితుడు.

1932: సుదర్శన్ భట్, మరాఠీ కవి

1977: సుదర్శన్ పట్నాయక్, భారత సైకత శిల్పి.

1992: వందన కటారియా, భారతీయ హాకీ క్రీడాకారిణి. పద్మశ్రీ పురస్కార గ్రహీత.

**మరణాలు:**

1845: మహారాజా చందు లాల్, హైదరాబాద్ రాజ్యానికి ప్రధానమంత్రిగా, పేష్కరుగా పలు హోదాల్లో పనిచేసిన రాజకీయవేత్త

1865 : అబ్రహాం లింకన్, అమెరికా 16 వ అధ్యక్షుడు

1961: రాచాబత్తుని సూర్యనారాయణ, సాతంత్ర్యసమయోధుడు.

## తాండవ ఎడమ కాలువ పూడికతీత పనులు



నాతవరం, (విశాఖ సమాచారమ్):- మండలం లోని తాండవ ఎడమ కాలువ పూడికతీత ఉపాథి హామీ పథకం ద్వారా 1 కోట 50 లక్షలు రూపాయలు నిధులుతో 55వేలు పనిదినాలు పనులు ను తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ,నాతవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తాండవ డిసి ప్రెసిడెంట్ మిడతాన ప్రసాద్, మాధవనగం సర్పంచ్ సోముల చింతపల్లి,డిసి మెంబర్ అల్లు సత్తిబాబు,మాజీ జెడ్పీటీసీ రేపటి మంగ,ఎపివో దాసరి కొండాజీ, ,మాధవనగరం తెలుగుదేశం పార్టీ నాయకులు గంటా శ్రీనివాసరావు, కూనిశెట్టి దివాణం,ఉల్లు రమణ,తానారి శ్రీను, మాకిరెడ్డి కొండబాబు,మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు కశింకోట గోవింద్ రావు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు అప్పల నరస తదితరులు పాల్గొన్నారు.

## వడ్డాదిలో భారీ వాన



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- మండలంలోని వడ్డాది చుట్టూ పక్కల ప్రాంతాల్లో భారీ తేలికపాటి గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీనితో మామిడి, అరటి పంటలకు భారీగా వాటిల్లింది. ఉదయం నుండి ఎండ వేడిమి తో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు మధ్యాహ్నం ఒకసారి గా కురిసిన భారీ వర్షానికి ఉపశమనం పొందారు. మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందారు.

## Spoken English -26

@ Daily Used English Sentences @

What's the time by your watch? - మీ గడియారంలో సమయం ఎంత?

I wish you a happy married life. -

Do you need anything? - మీకు ఏమైనా కావాలా?

I don't know telling a lie.- అబద్ధం చెప్పడం నాకు తెలియదు.

I invited him to tea.-: నేను అతనిని టీకు ఆహ్వానించాను.

Many happy returns of the day- ఇటువంటి జన్మ దినాలు మరెన్నో రావాలి నీకు!

Don't worry! How are things going? - బాధ పడకు! విషయాలు ఎలా జరిగినప్పటికీ..

What do we call this in English?- దీనిని మనం ఇంగ్లీషులో ఏమి అంటాము?

I am very pleased to meet you.- నిన్ను కలవడం బట్టి నాకు చాలా సంతోషంగా ఉంది.

Watch out! - కనిపెట్టు

Do you want to join me? - నాతో నీవు చేరాలని వుందా?

One has to pass the time anyhow.- ఒకరు సమయాన్ని ఏదో విధంగా గడపవచ్చు.

I will catch you soon. - నేను నిన్ను త్వరలో కలుస్తాను.

Don't move! Don't do this.- దాన్ని కదల్చకు!.అది చేయకు.

We do not travel first class.Please be seated.- మనం మొదటి తరగతిలో ప్రయాణం చేయడం లేదు.దయచేసి కూర్చో.

Let it be! - అలా ఉండనీ

Allow me to introduce myself. - నన్ను నేను పరిచయం చేసుకోనివ్వండి.

He looks rather nervous. - అతను ఏదో లా కనిపిస్తున్నాడు.

What is your problem? - నీ సమస్య ఏంటి?

Doesn't matter. It's up to you. - ఏమీ కాదు. నీకే విడిచి పెడుతున్నాను.

Put the books in order. - పుస్తకాలను క్రమంలో ఉంచు.

I will call you later.-: నేను నిన్ను తర్వాత కలుస్తాను.

I decline that.

Thank you for inviting us.- మమ్మల్ని ఆహ్వానించి నందుకు ధన్యవాదాలు

Are you coming?- మీరు వస్తున్నారా?

Plucking flowers is prohibited.- పువ్వులు కోయడం నిషేధం

We both like each other.- మనం ఇద్దరం ఒకరినొకరిలా వున్నాము.

I hate you! - నేను నిన్ను అసహ్యించుకుంటున్నాను.

I talked with him. - నేను అతనితో మాట్లాడాను.

What do you want to do?-; నీవు ఏం చేయాలను కుంటున్నావు?

Are you there? - నీవు అక్కడ వున్నావా?

Forget it Who will co-operate with you? - నీకు ఎవరు సహకారం అందిస్తారన్నా విషయాన్ని మర్చిపో

It was nice to talk with you.- నీతో మాట్లాడటం చాలా సంతోషం.

Can you please repeat that? - మళ్ళీ చెబుతారా?

As soon as possible!- సాధ్యమైనంత వరకు

When will you reach?- నీవు ఎప్పుడు చేరుకుంటావు?

Call me back.- ఒకసారి నన్ను పిలువు/ పోన్ చేయి

The terms were finalized.- నిబంధనలు పూర్తి అయ్యాయి.

The matter is clear. - విషయం స్పష్టంగా వుంది.

I appreciate it. What did you say? - నేను అభినందిస్తున్నాను.నీవు ఏం చెప్పావు?

How much is that? - అది ఎంత?

What can I do for you? - నేను నీకు ఏవిధంగా సహాయం చేయగలను?

I hope you understand. - నీవు అర్థం చేసుకున్నావని అనుకుంటున్నాను

Do you have some money?- మీ దగ్గర ఎమైనా డబ్బులు ఉన్నాయా?

**By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250**
**(Visakha Samacharam)**

# ఇంటర్ ఫలితాల్లో ప్రథమస్థానాన కృష్ణా

## గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు రెండు, మూడు స్థానాలు




**అమరావతి:** ఇంటర్ ఫలితాల్లో కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల హవా కొనసాగింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కృష్ణా 93%, గుంటూరు 91%, ఎన్టీఆర్ 89%, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కృష్ణా 85%, గుంటూరు 82%, ఎన్టీఆర్ 81% ఉత్తీర్ణతతో తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి. రెండో సంవత్సరం ఫలితాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా 73%, మొదటి ఏడాదికి సంబంధించి చిత్తూరు 54% ఉత్తీర్ణతతో అట్టడుగున ఉన్నాయి. ఎక్కువగా ఇంటర్ కళాశాలలు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే ఉండడం, రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఇక్కడే ప్రవేశాలు పొందుతుండడంతో ఈ రెండు జిల్లాల్లోనూ ఉత్తీర్ణత ఎక్కువగా నమోదైంది. రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత కూడా కృష్ణాలోనే ఎక్కువ విద్యాసంస్థలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోనూ కార్పొరేట్, ఇతర విద్యాసంస్థల్లో బయటి ప్రాంతాలకు చెందిన పిల్లలు ప్రవేశాలు పొందుతున్నారు. ఫలితాల్లో ఆ ప్రభావం కన్పించింది.

# పాఠ్యపుస్తకాలలో భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలి

## ప్రముఖ గాయకులు గంగాధర శాస్త్రి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- భగవద్గీతను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాలలో చేర్చాలని ప్రముఖ గాయకులు గీతా గాన ప్రవచన ప్రచారకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ ఎల్ వ గంగాధర శాస్త్రి కోరారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన శ్రీ నూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండగ జాతరలలో భాగంగా జరిగిన సనాతన క్షాత్రం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ. నేతృత్వంలో సంఘ సేవకులు కాంద్రేగుల శ్రీరామ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భగవద్గీతను జాతీయ గ్రంథంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అమరజీవి ఘంటసాల 106 భగవద్గీత శ్లోకాలు ఆలపించగా తాను 700 శ్లోకాలను ఆలపించామనిఇద్దరము తెలుగు వారం కావడం గర్వకారణం అని ఆయన అన్నారు. అలాగే భగవద్గీతను ఇంగ్లీషులో తర్జుమా చేయాలని అయోధ్య ,గురువాయూరు ఉడిపి , ప్రసిద్ధ కృష్ణ దేవాలయాలు ఉన్న ప్రాంతాలకు ఆయా భాషలలో అనువదిస్తామని ఆయన అన్నారు. భగవద్గీత విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడమే తన సంకల్పమని అని చెప్పారు. భారతీయులందరూ సనాత ధర్మం పాటించాలన్నారు.

నూకాంబిక అమ్మవారిని తొలుత కాకతీయులు అనగా దేవిగా పూజించేవారని రాను రాను అనగా పేరు అనకాపల్లిగా రూపాంతరం చెందిందని ఆయన అన్నారు. ఋగ్వేద అధ్యాపకులు సంతోష్ కుమార్ ఘనపాటి మాట్లాడుతూ అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారిని తొలుత ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు అనగా దేవిగా కొలిచారని ఆ అనగా దేవి పేరు అనకాపల్లిగా రూపాంతరం చెందిందన్నారు. తరువాత పాలించిన కాకతీయులు కాకతాంబగా కొలిచేవారని నూకాంబిక అమ్మవారిగా ప్రజలను చల్లగా చూసే నూకాలమ్మగా పిలవబడుతుందని అన్నారు. తను అనకాపల్లి వాస్తవ్యుడు నేనని ఎలమంచిలి నందు విశాఖపట్నం ప్రాంతాల్లోనే తమ తల్లిదండ్రులు ఉండేవారిని తెలిపారు.

భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఇప్పుడు వచ్చిందని సనాతన ధర్మంపై శంఖారావం పూరిస్తున్న రిఫ్లెక్షన్ ఛానల్ అధినేత అమోఘ్ దేశపతి అన్నారు. భారతదేశంలో ప్రస్తుతం ఎనిమిది రాష్ట్రాలలో హిందువులుమైనారిటీలుగా ఉన్నారన్నారు ఇది చాలా బాధాకరమైన విషయం అని ఆయన అన్నారు. హక్కును చేర్చుకునే మనసు భారతీయులకు ఉన్నంత అన్య మతస్థులకు ఉండదని ఆయన అన్నారు. సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని ఆయన అన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని గీతలో కృష్ణుడు చేసిన బోధనలను అర్థం చేసుకోవడంలో పరమార్థం ఉంటుందని ఆయన అన్నారు. అలాగే ప్రముఖ అడ్వకేట్ ఆంధ్ర నాట్య కళాకారిని టీఎస్ శుభ రాజేశ్వరి (మువ్వ) తమ ప్రసంగంలో సనాతన ధర్మం గురించి భారతీయ సంస్కృతి సాంప్రదాయాల గురించి ఔన్నత్యం గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలను మాజీమంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీమంత్రి మాడుగుల శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి సత్కరించి జ్ఞాపకలను అందజేశారు. అలాగే కార్యక్రమాన్ని నిర్వహకుడు కాంద్రేగుల శ్రీరామ్ ముఖ్య అతిథులకు సనాతన క్షేత్రం లో ప్రసంగించిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దూలం గోపి వ్యాఖ్యతగా వ్యవహరించారు. శ్రీ నూకంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను ( గొల్ల బాబు) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అల్లరించాయి

# బీజేపీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- యలమంచిలి నియోజకవర్గం బిజెపి క్రియాశీలక కార్యకర్తల సమావేశం అచ్యుతాపురం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో గావ్ చలో కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి బీజేపీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలి అని పిలుపునిచ్చారు.గ్రామాలలో బీజేపీ నేతలు మన కార్యకర్తలను కలవడం ప్రతి ఇంటికి ప్రధాని నరేంద్ర మోడీ గారు దేశవ్యాప్తంగా చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాల సంక్షేమ పథకాల గురించి తెలియజేయలన్నారు.గ్రామాలలో ఆలయాల సందర్శన తర్వాత గ్రామాల్లో ఆరోగ్యకేంద్రాలు, సచివాలయాల పనితీరు తెలుసుకోవాలని ప్రతి ఒక్కరికి బిజెపి కార్యకర్త అండగా నిలవాలన్నారు.అద్భుతమైన భావజా లం గల వ్యక్తులు మన బిజెపి పార్టీలో ఉండడం అదృష్టమని మొదటగా దేశం తర్వాతే మనం అనే సిద్ధాంతాన్ని దేశవ్యాప్తంగా ఉన్న బిజెపి కార్యకర్తలు తూచా తప్పకుండా పాటిస్తారని క్రమశిక్షణ గల క్రియాశీలక సభ్యులు భారతీయ జనతా పార్టీలో లక్షల్లో ఉంటారు అన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో బిజెపి బలోపేతానికి కృషి చేయాలని నాయకులకి కార్యకర్తలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు.రేపు అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా 20 రోజులు పాటు ఘనంగా నిర్వహించే రథయాత్రకు ముఖ్యఅతిథిగా రావాలని ఎంపీ సీఎం రమేష్ కి రావాలని మున్సిపల్ చైర్ పర్సన్ రామకుమారి ఆహ్వానం అందించారు. కార్యక్రమం అనంతరం పలువురు నాయకులు బిజెపి సిద్ధాంతాలకు ఆకర్షితులైన నాయకులకు సీఎం రమేష్ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ , అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు , ఎలమంచిలి మున్సిపాలిటీ చైర్ పర్సన్ పిల్ల రమాకుమారి , నియోజకవర్గ కన్వీనర్ రాజన్న నాయుడు , జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అధిక సంఖ్యలో క్రియాశీలక కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నుకాంబికా అమ్మవారి ఉత్సవాల్లో పిల్లల కోసం ఏర్పాట్లు సంతృప్తి కరం

## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- నుకాంబికా అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు మేరకు బాలల హక్కులు,వారి సంక్షేమానికి దేవస్థానం అధికారులు ప్రాధాన్యత కల్పించడం సంతృప్తి దాయకంగా ఉందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు.శనివారం ఉదయం సీతారాం కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు,వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్యనిర్వాహణాధికారి రాంబాబు,సిబ్బంది మురళిలతో కలసి కలయదిరిగారు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన తల్లి పాలు పెట్టే ప్రత్యేక కేంద్రాలు, చంటి పిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు,విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్లు,పిల్లలకు వేడి పాలు,బిస్కెట్లు పంపిణీని పరిశీలించారు,ఆలయ ప్రాంగణంలో బాలల హక్కులు,వారి సంక్షేమానికి సంబంధిత చట్టాలు,ప్రభుత్వ పథకాలుపై ఏర్పాటు చేసిన బ్యానర్లు ఏర్పాటును పరిశించారు,దివ్యాంగ పిల్లలకు సమకూర్చిన ట్రై సైకిళ్ళు,ప్రత్యేక మెడికల్ క్యాంపులును పరిశీలించారు.అనంతరం కమిషన్ సభ్యులు సీతారాం మాట్లాడుతూ గత నెల ఐదున ఆలయ ప్రాంగణంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జరిపిన సమీక్ష సమావేశంలో సూచించిన ప్రతీ బాలల అంశానికి ప్రాధాన్యత కల్పించడం సంతృప్తిదాయకంగా ఉందని అన్నారు,ఇదే స్పూర్తితో మాసోత్సవాల్లో బాలల హక్కుల పరిరక్షణలో ఎటువంటి ఉల్లంఘనలు జరగకుండా విజయవంతంగా ముగించాలని సూచించారు.ఆలయ కార్యనిర్వహణాధికారి రాంబాబు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు,రాష్ట్ర ప్రభుత్వ సూచనలు,సలహాలతో బాలల హక్కులకు పూర్తి ప్రాధాన్యత కల్పిస్తూనే విజయవంతంగా ముగిస్తామని చెప్పారు,ఈ పర్యటనలో దేవాదాయ శాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఐజీఐడీఆర్ లో ఫ్యాకల్టీ ఉద్యోగాలు.. నెలకు రూ.1,59,100 జీతం!




ముంబైలోని ఇందిరా గాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ 2025 సంవత్సరానికి సంబంధించి ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత ఉన్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టుల మొత్తం సంఖ్య:** 17

**ఖాళీల వివరాలు:**

ప్రొఫెసర్ - 03 పోస్టులు

అసోసియేట్ ప్రొఫెసర్ - 02 పోస్టులు

అసిస్టెంట్ ప్రొఫెసర్ (రెగ్యులర్/కాంట్రాక్ట్/విజిటింగ్) - 12 పోస్టులు

**విభాగాలు:** బిహేవియరల్ ఎకనామిక్స్, క్లైమేట్ ఛేంజ్ ఎకనామిక్స్, డేటా సైన్స్ & స్టాటిస్టిక్స్, ఎకనామెట్రిక్ థియరీ, ఎడ్యుకేషన్ ఎకనామిక్స్, పొలిటికల్ ఎకానమీ, టైమ్ సిరీస్ ఎకనామెట్రిక్స్ తదితర అంశాలు.

**అర్హతలు:**

సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణత ఉండాలి

సంబంధిత పని అనుభవం అవసరం

**వేతన వివరాలు:**

ప్రొఫెసర్: 1,59,100

అసోసియేట్ ప్రొఫెసర్: 1,39,600

అసిస్టెంట్ ప్రొఫెసర్: 1,01,500

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి

**చివరి తేదీ:** 05 మే 2025

అధికారిక వెబ్‌సైట్: www.igidr.ac.in

## అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వర్సిటీల్లో ఉద్యోగాల కోసం 15ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువతకు సర్కార్ తీపికబురు అందించింది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల డైరెక్ట్ నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదివారం విడుదల చేశారు.

గతంలో తీసుకొచ్చిన గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. 12 విశ్వవిద్యాలయాల్లో దాదాపు 2,500కు పైగా బోధన సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నియామకాలను ఎలా చేపట్టాలనే దానిపై కొన్ని నెలల క్రితం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది.

ఈ కమిటీ సిఫార్సు చేసిన మార్గదర్శకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. యూజీ, పీజీతో పాటు సాంకేతిక, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే అధ్యాపకుల నియామకానికి రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది. నియామక ప్రక్రియలో మూడు దశలను అనుసరిస్తారు. ప్రతీ యూనివర్సిటీలోనూ కమిటీ ఏర్పాటు చేసి, రోస్టర్ విధానం, రిజర్వేషన్ విధానానికి సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేస్తారు. దీనికి విశ్వవిద్యాలయం వీసీ నాయకత్వం వహించాల్సి ఉంటుంది.

డిబెజె బ్యాంక్ జాబ్స్: డిగ్రీ, పీజీ అర్హతతో ఐడిబీఐ బ్యాంక్‌లో ఉద్యోగాలు జీతం నెలకు 93,960

ప్రభుత్వం ఆమోదించిన మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి..

అకడమిక్ రికార్డ్, పరిశోధనలకు సంబంధించి 50 మార్కులను కేటాయిస్తారు. యూనివర్సిటీ వీసీ, ఉన్నత విద్యా మండలి సబ్జెక్ట్ నిపుణుడు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, డిపార్ట్‌మెంట్ ముఖ్యుడు మార్కుల స్క్రూటినీ చేస్తారు. అభ్యర్థికి సంబంధించి యూజీ నుంచి రీసెర్చ్ వరకూ వివిధ విద్యా స్థాయిల్లో మార్కులను ఖరారు చేస్తారు. మొత్తం వంద మార్కుల్లో ఇంటర్వ్యూకు 20 మార్కులు, టీచింగ్ నైపుణ్యానికి 30 మార్కులు ఉంటాయి. మిగతా 50 మార్కులను యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ విభాగాల నుంచి అభ్యర్థి సాధించిన మార్కుల శాతం ఆధారంగా తీసుకుంటారు.

నాలెడ్జ్ అండ్ స్కిల్స్‌కు 30 మార్కులు ఇస్తారు. ఈ మార్కులను టీచింగ్, బుక్ ఆథర్‌షిప్, జాయింట్ ఆథర్ షిప్, ఎడిట్ ఆథర్‌షిప్, కో-ఎడిటర్ ఆథర్‌షిప్, పోస్టు-డాక్టోరల్ షిప్‌గా విడగొడతారు. ఈ మార్కులను ఆయా సబ్జెక్టు లెక్చరర్లు పరిశీలించి, నిర్ణయిస్తారు. ఇంటర్వ్యూకు 20 మార్కులు ఇస్తారు. ఇందులో సబ్జెక్టు ప్రజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, ఓవరాల్ పర్సనాలిటీ, నైపుణ్యాన్ని బట్టి మార్కులు వేస్తారు.

## డిగ్రీ అర్హతతో యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నాన్ టీచింగ్ పోస్టులు.. ఎంపిక విధానం ఇలా!

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఉద్యోగాలు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ మరియు డిప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు చివరి తేదీ లోపు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం పోస్టులు: 07

**పోస్టుల పేర్లు:**

లైబ్రేరియన్ - 01, ఇంజనీర్ - 01, డిప్యూటీ రిజిస్ట్రార్ - 03

ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్ - 01

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - 01

**అర్హత:** లైబ్రేరియన్ పోస్టుకు లైబ్రరీ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉండాలి. మిగతా పోస్టులకు సంబంధిత అనుభవం తప్పనిసరి.

**వయస్సు పరిమితి:** లైబ్రేరియన్ - గరిష్ఠ వయస్సు 62 ఏళ్లు

ఇంజనీర్ - గరిష్ఠ వయస్సు 56 ఏళ్లు

**వేతన శ్రేణి (పే స్కేల్):**

లైబ్రేరియన్: 1,44,200 - 2,18,200

ఇంజనీర్: 1,23,100 - 2,15,900

డిప్యూటీ రిజిస్ట్రార్: 78,800 - 2,09,200

ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్: 78,800 - 2,09,200

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్: 67,700 - 2,08,700

దరఖాస్తు విధానం: అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి.

దరఖాస్తు చివరి తేదీ: 28-04-2025

# రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు

## అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే దేశంలో సుస్థిర పాలన సాగుతోంది

### ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంటే దళిత వర్గాల నాయకులే కాదని ప్రపంచ దేశాలు సైతం ఆయన ఆశయాలను ఆదర్శాలను అవలంబిస్తున్నారని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవారం బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయం , అనకాపల్లి నాలుగురోడ్ల జంక్షన్, బీముని గుమ్మం, తుమ్మపాల, ఆర్. ఓ ఆఫీస్ ల వద్ద జరిగిన అంబేద్కర్ జయంతి కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహాలకు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు .ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 150 కోట్ల జనాభా కల్గిన ఈ దేశం ఇంత సుస్థిర పరిపాలన, శాంతి సౌభ్రాతృత్వం తో చేస్తున్నరు అంటే అది కేవలం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల మాత్రమే అనిఅన్నారు. త్వరలోనే ఈ నూతనంగా ఏర్పడ్డ జిల్లాకి అంబేద్కర్ పేరు మీద స్టడీ సర్కిల్ ను అదేవిదంగా జిల్లా స్థాయి సామజిక భవనాన్ని ఏర్పాటు చేస్తాము అని అందుకు తగిన విధంగా తాను అలాగే హెూం మంత్రి కూడా చర్యలు చేపడతామని అన్నారు,ఈ ప్రభుత్వం కూడా అయన ఆశయాలను ముందుకు తీసుకు వెళుతూ మరలా తిరిగి ఎస్. సి, ఎస్. టీ సబ్ ప్లాన్ నిధులు అధిక శాతం కేటాయించడమే కాకుండా వారందరికీ లబ్ది చేకూర్చే విధంగా చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## తగరపువలసలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ అంబేద్కర్ 134.వ జయంతి సందర్భంగా ఈ రోజు జీవీఎంసీ 1.వ వార్డు బంగ్లామెట్టలో ఎస్సి సెల్ నాయకులు సోమి అప్పలరాజు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. వైసిపి జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి,, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి,1.వ,వార్డు సెక్రటరీ వెంపాడ రమణ రెడ్డి,,కుమిలి సూర్యానాయణ,, తమ్మిన అశోక్,ఇంటి రమణ,పిల్ల,సత్తిబాబు తదితరులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్ అంబేద్కర్ జోహార్ అని జోహార్లు అర్పించారు. అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగాన్ని గుర్తు చేసుకున్నారు..అనంతరం పిల్లలకు బిస్కెట్ చాక్లెట్ స్వీట్స్ పంచారు...

## ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అరుగుజాడల్లో నడవాలి

### డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** సమాజంలోని అంటరానితన్నాన్ని నిర్మూలించేందుకు అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు సూచించారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎల్ఐసి జంక్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి, అలాగే భీమ్ నగర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం కోసం, బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి మహనీయుడు అంబేద్కర్ కొనియాడారు.

నూకరాజు ,రమణ , సత్యనారాయణ , గండేటి కృష్ణ , గండేటి జనార్ధన్ , వెంకటేష్ , సరళ ప్రసాద్ , పినిపిల్లి కనకరాజు ,కంచుమూర్తి ఈశ్వరావు , పినిపిల్లి రాజు , పినిపిల్లి కనకరాజు , ఐనడా త్రినాద్ , రాంబాబు , రామకృష్ణ , కుమారి ,బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కు ఘన నివాళి



**అచ్యుతాపురం, (విశాఖ సమాచారమ్):-** భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా అచ్చుతాపురంలో నిర్వహించిన సభకు సీఐటీయూ మండల కన్వీనర్ కె. సోమునాయుడు అధ్యక్షత వహిహించగా అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ నాయకులు తట్టా రాజు ,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము , పూలమాలవేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు.

ఈ సందర్భంగా రాము, ఎస్సీ సెల్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఆర్ రాహుల్ మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక న్యాయంకోసం జీవితాన్ని త్యాగం చేసి మనకు ఇచ్చిన రాజ్యాంగాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తుంగలోకి తొక్కాలని చూస్తుందన్నారు. మనుధర్మ సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్ది అగ్రకుల దురహంకారాన్ని అన్ని కులాలమీద రుద్దడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, ఆదివాసీలు, మహిళల మీద దాడులు అమానుషంగా పెరుగుతున్నాయన్నారు. రాజ్యాంగం పరిరక్షణ కోసం కులాలకు, మతాలకతీతంగా అందరం ఐక్యంగా నిలవాలని, అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రభుత్వాలపై పోరాడడమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగెల. మోహన్, తట్టా. శ్రీను, సూరిబాబు, అచ్చుతాపురం మాజీ సర్పంచ్ రెడ్డి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి మరియు గ్రామ సభ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి, సందర్భంగా సోమవారం అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళు లర్పించారు. మరియు ఉపమాక గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి,వి ఆర్ ఓ కామరాజు, కొప్పిశెట్టి శ్రీను, దిలీప్, గ్రామ పెద్దలు,నాయకులు మరియు గ్రామ కార్యదర్శి జయప్రకాష్, ఉపమాక సర్పంచ్ వీరబాబు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ బుద్ధ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా 80 వ వార్డు అంబేద్కర్ నగర్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి శాసనమండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వాతంత్ర యోధులు , భారత రాజ్యాంగాన్ని రచించిన మహెూన్నత వ్యక్తి, అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుప్పిలి జగన్ బోడి వెంకటరావు పిళ్ళా తారకేష్ మల్ల గణేష్ యల్లపు నూకేష్ దాడి అప్పారావు రామోజీ శ్యామ్ సుందర్ బొడ్డేడ దేవయ్య బుద్ధ భువనేశ్వరరావు పెంటకోట శివరాం బుద్ధ మహాలక్ష్మి నాయుడు కాండ్రేగుల జగదీష్ కాండ్రేగుల వెంకట సూరిబాబు పెంటకోట వరప్రసాద్ బుద్ధ విశ్వనాథం సూరిశెట్టి శ్రీనివాసరావు కాండ్రేగుల రవీంద్ర దాడి వేణు శ్రీకాకుళం గణపతి చింతపల్లి కృష్ణ కాండ్రేగుల గోపికృష్ణ బుద్ధ శ్రీనివాసరావు బొడ్డేడ నూకరాజు పెంటకోట శివరాం గొడుగు కొణతాల బాల సాలాపు నాయుడు నడిపురి నడిపూరి వీరి నాయుడు ఎర్రమళ్ళకేశవ మర్ర జోగారావు కట్ట అప్పలరాజు గోవాడ రాజు నేతల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాల అనుసరణే ఆయనకు అసలైననివాళి



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** భారత రాజ్యాంగ నిర్మాతగానే కాక భారత జాతి వికాసానికి నిరంతరం ఆలోచనలు చేసి వాటి అమలుకు అహర్నిశం పాటు పడిన బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను అనుసరించి పనిచేయడమే ఆయనకు భారతజాతి అందించే అసలైన నివాళి అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.

సోమవారం అంబేద్కర్ 134వ జయంతి వేడుకల సందర్భంగాఅనపర్తి లో ఆయన స్వగ్రామం రామవరం గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లోఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు అంబేద్కర్ ఆశయాలను విస్మసించారని , ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన ఆశయాలను తూచ తప్పకుండా అదులు చేస్తూ అందరి మన్ననలుఆయకుంటున్నాయన్నారు.

కెనాల్ రోడ్ లోని మాలమహానాడు నాయకులు నల్ల చిన్నారావు, గారా తాతారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలకుఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనపర్తి మండలం మహేంద్రవాడలో అంబేద్కర్ యూత్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, మాజీ జెడ్పిసి సభ్యులు పడాల వెంకట్రామారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మండలంలోని పీరా రామచంద్రపురం గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు కర్రీ బుల్లిరెడ్డి అంబేద్కర్ విగ్రహాన్ని తనే స్వయంగా కడిగి శుభ్రం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కొవ్వూరి శ్రీనివాసరెడ్డి( దత్తుడు శ్రీను ), తమలపూడి సుధాకర్ రెడ్డి, బాసి, వెలగల నారాయణరెడ్డి, వెలగల వాసు, సత్తి సుబ్బారెడ్డి, రాజు, గోపి, యాదల శామ్యూల్, దాకే కాంతారావు, బిల్లా నరేష్, మద్ద సతీష్ ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి శ్రమించిన మహెూన్నత వ్యక్తి అంబేద్కర్



**బుచ్చయ్యపేట, (విశాఖ సమావచారమ్):-** భారత్ రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా మండలంలోని ఎల్బిపి అగ్రహారం రెల్లి వీధి లో నవజీవన రెల్లి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, గేదెల సత్యనారాయణ

స్థానిక రెల్లి కుల అంబేద్కర్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమ వారి హక్కుల కోసం తన జీవితం అంతా పోరాడిన మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని కొనియాడారు. భారత రాజ్యాంగ రచన ద్వారా మన దేశంలోని అట్టడుగు వర్గాలకు అనేక హక్కులు కల్పించిన మహెూన్నతమైన వ్యక్తి అని అన్నారు. విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి శ్రమించిన మహెూన్నత వ్యక్తి అంబేద్కర్ అని అన్నారు. ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహనీయుని ఆశయ సాధన కోసం పోరాటం చేయడమే వారికి మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ తామరాన దాసు, సాయం శేషు, నవజీవన రెల్లి కుల సంక్షేమ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు నిమ్మకాయల ఆనందరావు, మంగళగిరి రాఘవేంద్ర రావు, ముత్యాల భాస్కరావు, యర్రంశెట్టి శివ ప్రసాద్, ముత్యాల రమేష్, బొర్ర జై ప్రసాద్, నిమ్మకాయల రఘు, వార్డు మెంబెర్ ముత్యాల త్రివేణి, పెద్ద ఎత్తున యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు ఎనలేనివి



**కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):-** పేద, బడుగు బలహీన, అణగారిన వర్గాల కోసం భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన మంచి ఎంత చెప్పిన తక్కువే అని ఎంపీపీ బడుగు రమేష్ బాబు అన్నారు. సోమవారం రాజేంద్ర పాలెం లో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బాబు సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి అయన తొ పాటు సర్పంచ్ పీత సింహాచలం, ఎంపీడీవో ఎస్.కే.వి ప్రసాద్, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది నివాళులు అర్పించారు. తరువాత రాజేంద్రపాలెం సచివాలయంలో అంబేద్కర్ ఫోటోలకు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రమేష్ బాబు తో పాటు అధికారులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు ఆయన వల్లే పేద బడుగు బలహీన వర్గాలకు మంచి జీవితాలు ఇవ్వగలిగారని ఆయన చేసిన రాజ్యాంగం వల్ల అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నూకాలమ్మ, సిపిఎం నేత సర్ మూర్తి సూరిబాబు డిజిటల్ అసిస్టెంట్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజబాబు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం అనకాపల్లి భీముని గుమ్మం జంక్షన్లో అంబేద్కర్ విగ్రహానికి అనకాపల్లి విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి.డి నాయుడు అనకాపల్లి టౌన్ అధ్యక్షులు నుదురుపాటి తాతాజీ పూలమాలవేసి నివాళులు అర్పించారు. డాక్టర్ డి డి నాయుడు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారత దేశ సుస్థిర పరిపాలనకు సామాజిక సమరసతకు భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహానుభావుడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రాంత ప్రతినిధి శ్రీకాళహస్తి జిల్లా కోశాధికారి ఆడారి రాజు, జిల్లా సేవా ప్రముఖ నందన్ శర్మ, అనకాపల్లి పట్టణ సహకార్యదర్శి గోకవరపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజనీతిజ్ఞుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశంలో అత్యంత మేధావిగా పేరుగాంచారని. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక లక్ష్మీదేవి పేట, రైల్వే స్టేషన్ భీముని గుమ్మం , గవరపాలెం అంబేద్కర్ నగర , అనకాపల్లి మెయిన్ రోడ్డు శ్రీ పోలమాంబ గుడి తుమ్మపాల గ్రామం ఎస్సీ కాలనీ వద్ద జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలలో రత్నాకర్ పాల్గొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారత తొలి న్యాయశాఖ మంత్రి, తత్వవేత్త, రచయిత, అర్థశాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 134వ జయంతి సందర్భంగా రత్నాకర్ అంబేద్కర్ గారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ రత్నాకర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత దేశంలో కెల్లా అత్యంత మేధావిగా, రాజనీతిజ్ఞునిగా పేరుపొందారని అన్నారు. ఇటువంటి మహనీయులు యొక్క జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని మనం కూడా ఆచరించి వారు సాధించిన ఘనతలో కొంత భాగమైన మన భావితరాలకు అందించడం కోసం ఇటువంటి మహనీయుల యొక్క జయంతి వేడుకలను జరుపుకోవడం జరుగుతుందన్నారు. లిఖితపూర్వక రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేద్కర్ కి చెందుతుందని అన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం మనమందరం ధృడ సంకల్పంతో పోరాటం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు రేభక రామారావు, రేభక మధుబాబు, కటారి దేవుడు, రేభక నాగరాజు, కాయల ప్రసన్న లక్ష్మి, బోని గణేష్, దొమ్మి సత్యారావు, మర్ర జోగారావు, మునగపాక నర్సింగరావు, కంకణాల ఆదిమూర్తి, రవ్వ ఈశ్వరరావు, రేబాక ఇంద్ర కుమార్, లంబ జాన్, బాతు సాయి, కొడతా రాముడు, లంబ గోపాల్, మిడిపాటి హరిప్రసాద్, కట్ట అప్పలరాజు, మర్ర రమేష్, గోపాడ రాజు, పెట్ల అప్పారావు, రాబాక విజయకృష్ణ, రేపాక తిరుమల రావు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఆధ్వర్యంలో 80వ వార్డులో ఘనంగా అంబేద్కర్ జయంతోత్సవాలు



**అనకాపల్లి, (విశాఖసమాచారమ్):-** స్థానిక 80 వ వార్డులో డాక్టర్ బి ర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వైయస్సార్సీపి 80 అవార్డు ఇంచార్జి కే యం. నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను వైకాపా జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు అనంతర పేద విదార్థులకు డాక్టర్ సత్యవతి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ భీశెట్టి వెంకట సత్య వతి. వైకాపా నాయకులు దంతులూరి దిలీప్ కుమార్. మలసాల కుమార్ రాజా.. మందపాటి జానకి రామ రాజు. డి. వి నర్సింగ రావు. డాక్టర్ సిద్ధార్థ్. వేగి త్రినాథ్. కాండ్రేగుల హైమవతి. దాడి నారాయణరావు పెంటకోట శ్రీను మారిశెట్టి శ్రీను. బుద్ధ రాజు కర్రి రమేష్ ,రాయ వరపు జోగిరాజు, కాండ్రేగుల తులసికొణతాల త్రినాథ్. మరియు కార్య కర్తలు పాల్గొన్నారు

## వేగేశ్వరపురంలో శాంతియుతంగా అంబేద్కర్ జయంతి



**తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను శాంతియుతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాజమండ్రి ట్రాఫిక్ సిఐ బాలశౌరి, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జై భీమ్ రాష్ట్ర అధ్యక్షులు కురువెల్ల భానుచందర్, తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ, రాజమండ్రి ఎస్సై ఏక సత్యనారాయణ, జై భీమ్ యూత్ యు. రవికుమార్, ఎమ్.ప్రేమ్ కుమార్, కె.ఆదర్శ్, కె.శివా రెడ్డి, ఎమ్.వెంకటేష్, ఏ. శ్రీనివాస్ మరియు జై భీమ్ యువసేన పాల్గొని జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## గోపాలపురంలో అంబేద్కర్ జయంతి



**గోపాలపురం, (విశాఖ సమాచారమ్):-** గోపాలపురం అంబేద్కర్ జయంతి వేడుకలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పెద్దగూడెంలో జయంతి వేడుకలు సంతోషంగా ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా యూత్ ప్రెసిడెంట్ గారు పైడి దొరబాబు, తలారి చందు, దాసరి అబ్రహం గారు దాకే సత్తియ మరియు యూత్ సభ్యులు మహిళలు పిల్లలు పెద్దలు గ్రామస్తులు మొదలగువారు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను సంతోషంగా ఆనందంగా నిర్వహించారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**గోపాలపురం, (విశాఖ సమాచారమ్):-** గోపాలపురం నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను గోపాలపురం మండలంలో కోమటికుంట గ్రామంలో వెలగా శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను గ్రామస్తులు యవనస్తులు పెద్దలు అందరూ కలిసి నిర్వహించారు.

గోపాలపురం ఉప్పరగూడెంలో అరుంధతి నగర్ లో అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి అరుంధతి నగర్‌లో ఏపీ ఎంఆర్పిఎస్ ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ గెల్లా వెంకట శ్రీనివాస్ మాదిగ గ్రామస్తులు చిన్నలు, పెద్దలు అందరూ కలిసి జయంతి వేడుకలను ఘనంగా సంతోషంగా నిర్వహించారు.

## ఔరంగాబాద్ లో మహనీయుల జయంతి వేడుక



**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):-** భారతరత్నడా. బి.ఆర్. అంబేద్కర్ 134 వ జయంతి తూర్పు గోదావరి జిల్లా ఔరంగాబాద్ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ సెంటర్ నందు దళిత నాయకులు పెనుమాక జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా డా.బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దళితుల అభ్యున్నతికి కృషిచేసిన మహానుభావులు ఏప్రిల్ నెలలో జన్మించడం గొప్ప విశేషమని పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే, భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు . ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ కుల వివక్షత ను చవిచూసాడని , దళిత హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచిన మహానుభావుని కొనియాడారు. రిజర్వేషన్లు రూపొందిస్తే అమలు చేయుటకు బాబూ జగ్జీవన్ రామ్ కృషి చేయడం జరిగిందని చెప్పారు. స్వతంత్రం ముందు పూలే సమాజంలో రుగ్మతలపై పోరాటం చేసి , వితంతు వివాహాలు , స్త్రీలకు పాఠశాలలు నెలకొల్పడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేసాడని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో కేబీ. గాంగేయుడు , కందెల్లి రామారావు, కొడమంచిలి రమణ , ఎస్. పుల్లయ్య , ఏ మంగరాజు , బొల్లిపో మధు శేఖర్, ముప్పిడి రాజు, జయ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## చౌడువాడ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ప్రారంభానికి సిద్ధం

ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్: పి. వెంకటేశ్వరరావు



కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- మండలంలోని చౌడువాడ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పనులను వేగవంతంగా పూర్తి చేసి, వచ్చేనెల అఖరి వారంలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామని, ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వెంకటేశ్వరరావు అన్నారు. చౌడువాడ గ్రామంలో సబ్ స్టేషన్ పనులను పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ సబ్ స్టేషన్ మూడు కోట్ల 65 లక్షల 88 వేల రూపాయలతో పనులు జరుగుతున్నాయని, ఇది 33 / 11 కేవి సబ్ స్టేషన్ గా పేర్కొన్నారు. ఈ సబ్ స్టేషన్ పూర్తయినట్లయితే ఈ ప్రాంత వాసులకు ఎల్లవేళలా కరెంటు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషి ఫలితంగా ఇక్కడ సబ్ స్టేషన్ ఏర్పాటు అయిందని, ఈ ప్రాంత వాసులు అంతా ఆయనకు రుణపడి ఉంటారని చెప్పారు. ఈయన వెంట సీఎంఆర్ఎం ఇంజనీరింగ్ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి బాలాజీ, డిప్యూటీ ఇంజనీర్ కిషోర్, జేఈఎల్వీ రమణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



అనంతపురం, (విశాఖ సమాచారమ్):- స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు నగర పాలకొన్నత పాఠశాల, అనంతపురము నందు 1976-1977 సంవత్సరములో 10 వ తరగతి చదివిన విద్యార్థుల కలయిక జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి శ్రీదేవి గారు అధ్యక్షత వహించారు. ఈ బ్యాచ్ లో చదివిన వారు విద్య, వైద్యం, న్యాయ శాఖ, రెవిన్యూ, ఆడిట్, అటవీ శాఖ, పోస్టల్, BSNL తదితర రంగాలలో సేవలందించి పదవి విరమణ పొందారు. తమ చిన్న నాటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను, గురువులతో వారికి వున్న సత్సంబంధాలను నెమరు వేసుకున్నారు. గురువులు శ్రీ సూర్య నారాయణ శాస్త్రి, రంగప్ప, కృష్ణ మూర్తి గంగాచారిని ఘనంగా సన్మానించారు. తమ శిష్యులు వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉన్నందుకు చాలా అభినందించారు. మంచిగా బ్రతకాలని, సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హై కోర్ట్ అమరావతి న్యాయమూర్తి B. శ్యామ సుందర్, అటవీ శాఖ అధికారి E.N. ఆంజనేయులు, వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షకులు M.మనోహర్, పోస్టల్ శాఖ పోస్టుమాస్టర్ G. వన్నప్ప, ఆడిటర్ హరినాథ్, విశ్రాంత తహసీల్దార్ సిరాజుద్దీన్, విద్యా శాఖ షేక్ మహబూబ్ బాషా, రియాజుద్దీన్, రక్షణ శాఖ లక్ష్మీ కాంత రెడ్డి, వ్యాపార వేత్త అబ్దుల్ ఖయుమ్ దాదాపు 50 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తరువాత గురువులు పుల్లన్న గారిని, పద్మనాభ శాస్త్రి గారిని, చిన్నకేశవులు గారిని ఇంటి వద్దకు వెళ్లి ఘనంగా సత్కరించారు.

## పాండ్రంగి గ్రామంలో రైతులకు ఘన సన్మానం



భీమునిపట్నం, పద్మనాభం, (విశాఖ సమాచారమ్):- విశాఖ జిల్లా పాండ్రంగి గ్రామం, కోరాడ యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ పల్లి మహేష్, పిన్నింటి రమణ, విద్యా సాగర్, హేమ సుందర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదర్శంగా నిలుస్తున్న రైతులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాండ్రంగి గ్రామ అధ్యక్షులు పల్లి మహేష్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీ పిన్నింటి రమణ, మరియు ఎంటి విద్యా సాగర్, ఎన్ఎఫ్‌జె హేమ సుందర్ గారు హాజరయ్యారు. రైతుల కృషిని గుర్తించి వారిని బహుమతులు, సన్మాన పత్రాలతో గౌరవించారు.

ఈ సందర్భంగా కోరాడ యూనిట్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు కోరాడ అప్పలనారాయణ, పాండ్రంగి గ్రామానికి చెందిన కృష్ణ తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. రసాయన రహిత వ్యవసాయం వల్ల భూమికి జరిగిన మేలు, ఉత్పత్తిలో వచ్చిన నాణ్యత, ప్రజల ఆరోగ్యానికి కలిగిన లాభాలను వివరించారు.

పల్లి మహేష్ మాట్లాడుతూ, "ప్రకృతి వ్యవసాయం మన పూర్వీకుల జీవన విధానానికి దగ్గరగా ఉంటుంది. ఇది భూమి ఆరోగ్యాన్ని కాపాడుతుంది, నీటి వనరులను సంరక్షిస్తుంది, మరియు మన తదుపరి తరాలకు ఒక ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందిస్తుంది. ఇలాంటి మార్గంలో నడిచే ప్రతి రైతు అభినందనీయం" అని అన్నారు.

ఎంపీటీసీ పిన్నింటి రమణ మాట్లాడుతూ, "సరైన ప్రోత్సాహం ఉంటే ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించవచ్చు. రైతులకు మద్దతుగా మేము ఎల్లప్పుడూ నిలుస్తాం" అని అన్నారు.

విద్యా సాగర్ మరియు హేమ సుందర్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, రైతులకు శిక్షణలందించిన విధానాలను వివరించారు. "ఈ మార్గం ద్వారా రైతు సంపద పెరుగుతుంది, వ్యయాలు తగ్గుతాయి. ఆహారం స్వచ్ఛంగా మారుతుంది. ప్రకృతి వ్యవసాయానికి ఇది ఒక ఉద్యమంగా మారాలని ఆశిస్తున్నాం" అని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహంతి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మరింత నమ్మకం పెంచుకుంటున్నామని, భవిష్యత్తులో తమ సొంత గ్రామాలను ప్రకృతి వ్యవసాయం హబ్‌గా మార్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయం సంస్థ సభ్యులు, గ్రామస్తులు, యువత పాల్గొనడంతో ఈ కార్యక్రమం విజయవంతం చేశారు.

## స్కౌట్స్, గైడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సప్తగిరి హేచరీస్ అధినేత పెదబాబు



పాయకరావుపేట, (విశాఖ సమాచారమ్):- కాకినాడ జిల్లా, తొండంగి మండలం, అద్దరిపేట గ్రామంలోని హైస్కూల్ నందు శనివారం ఎన్‌సీసీకి సంబంధించి స్కౌట్స్ మరియు గైడ్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సప్తగిరి హెచరీస్ అధినేత పెదబాబు గారు రావడం జరిగింది. అతిథులుగా శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేమాల శ్రీనివాసరావు (యన్.ఎస్.ఆర్) పాల్గోవడం జరిగింది. అనంతరం హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి సమక్షంలో సప్తగిరి పెదబాబు ఎన్‌సీసీ కార్యక్రమాన్ని ప్రారంభించం జరిగింది. గతంలో పెదబాబు తన సొంత డబ్బులతో హైస్కూలుకు 120000/- రూపాయలు విలువ చేసే ఐరన్ గేట్ వేయించడం జరిగింది. గేటుకు సంబంధించి ఈ రోజు స్టూడెంట్స్, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ కుటుంబ సభ్యుల సమక్షంలో పెదబాబు గారు దానికి శిలఫలకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెరుగు సత్తిబాబు, యాదల బాబురావు, కాలిబోయిన రాజా, కోటేష్, ఇతర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డా. బీ.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు నిర్వహించిన అనకాపల్లి జిల్లా పోలీసులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- భారత రత్న, మహనీయ తత్వవేత్త డా? బీ.ఆర్. అంబేడ్కర్ 134వ జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో అంకితభావంతో నిర్వహించారు. డీఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, ముఖ్య అతిథిగా హాజరై డా? అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, "డా? అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాలకు శాశ్వత ప్రేరణ, దేశ ప్రజలకు ఆదర్శప్రాయ నాయకులు. ఆయన విద్యా సాధనతో, అసమానతలపై పోరాటంతో, రాజ్యాంగ నిర్మాణంలో చూపిన దృఢతతో భారత దేశానికి మార్గదర్శకుడయ్యారు" అన్నారు. అలాగే, "స్త్రీలకు విద్యా హక్కులు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు, కుల, మత, లింగ విభేదాలు లేకుండా సమానత్వానికి ఆయన రూపొందించిన రాజ్యాంగం నిలువెత్తు నిదర్శనం. డా? అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుచుకుంటూ, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ పాత్ర వహించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, ఎస్బి ఇన్స్పెక్టర్ బాల సూర్యరావు, అనకాపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, ఎస్సై సత్యనారాయణ తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని, డా. అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు.

## ఇంటర్ బైపీసీ ఫలితాల్లో శశి విద్యార్థిని తాటిపూడి లిఖిత శ్రీ ప్రభంజనం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఇంటర్ బైపిసి మొదటి సంవత్సరం ఫలితాల్లో శశి విద్యార్థిని, చిన్నముషిడివాడ, శాంతినగరం కి చెందన చిన్నారి తాటిపూడి లిఖిత శ్రీ ప్రభంజనం సృష్టించింది . విశాఖపట్నం, బోయపాలెం బ్రాంచ్ లో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న లిఖిత శ్రీ 440 మార్కులకి 433 మార్కులు సాధించి తన సత్తా చాటింది. ఈ సందర్భంగా లిఖిత శ్రీ మాట్లాడుతూ తాను డాక్టర్ అవ్వడమే లక్ష్యంగా చదువుతున్నట్లు తెలిపారు. డాక్టర్ అయ్యి నిరుపేదలకు ఉచిత వైద్యం అందించడమే తన కోరిక అని అన్నారు. అలాగే శశి విద్యాసంస్థల యాజమాన్యం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల మెరుగైన విద్యా బోధన వలన తనకు 433 మార్కులు వచ్చాయని తెలిపారు. జూనియర్ ఇంటర్ లో విశేష ప్రతిభ కనబరిచిన లిఖిత శ్రీ ని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ,అకడమిక్ డైరెక్టర్ మేక క్రాంతి సుధ, కళాశాల ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు తాటిపూడి లిఖిత శ్రీ ని అభినందించారు. తమ కుమార్తె లిఖిత శ్రీ మంచి మార్కుల్లో ఉత్తీర్ణత సాధించడం పట్ల డాక్టర్ తాటిపూడి. వి. వి. సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. పదవ తరగతిలో కూడా 584 మార్కులు వచ్చాయని తెలిపారు. అలాగే ఉత్తమ విద్యను అందిస్తున్న శశి యాజమాన్యానికి, అధ్యాపకులకు ధన్యవాదములు తెలియజేశారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- నాటుసారా వంటి మత్తు పదార్థాలుకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఆల్కహాల్ వ్యసనం నుండి విముక్తి పొందడానికి ప్రభుత్వ సహకారం తో నడుస్తున్న జిల్లా డి అడిక్షన్ కేంద్రం లో ఉచితంగా చికిత్స అందించబడుతుందని జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి వి. సుధీర్ తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలుకు సంబందించి అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన 'కమిటీ ఆన్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ సభ్యులు శనివారం మునగపాక మండలం వెంకటాపురం గ్రామంలో ఉన్న ఆర్ హెచ్ ఐ మాగ్నిజిట్ ఇండియా పరిశ్రమలోని కార్మికులకు ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి వి. సుధీర్ మాట్లాడుతూ నాటుసారా వంటి మత్తు పదార్థాలుకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఆల్కహాల్ వ్యసనం నుండి విముక్తి పొందడానికి ప్రభుత్వ సహకారం తో నడుస్తున్న జిల్లా డి అడిక్షన్ కేంద్రం లో చేరితే ఉచిత భోజనం, వసతి సౌకర్యంతో 30 రోజుల పాటు ఉచితంగా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. కేర్ కమిటీ సభ్యులు సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సన్యాసిరావు మాట్లాడుతూ ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు గూర్చి పారిశ్రామిక కార్మికులకు వివరించి ఆరోగ్యంను కాపాడుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏ ఇ ఎస్ రాజశేఖర్ గారు, అనకాపల్లి ఎక్సైజ్ సీఐ వై. లక్ష్మీనాయుడు, ఆర్ హెచ్ ఐ కంపెనీ ప్లాంట్ హేడ్ నాగేశ్వరరావు, కంపెనీ ప్రతినిధులు శంకర్ , వెంకట సత్యం, ఎక్సైజ్ ఎస్ ఐ గణేష్, సర్వే జనో ఐక్య వేదిక ఎన్ జి ఓ అధ్యక్షుడు కోరిబిల్లి పరమేష్ మరియు కంపెనీ కార్మికులు పాల్గొన్నారు.

## భగవన్నామస్మరణ ఆయుష్షుకు మాలధారణ

ప్రాణం పోయేటప్పుడు చెవిలో పడ్డ మాట, మనస్సులోని తలంపు ఇవన్నీ కలసి మరు జన్మకు కారణమవుతాయి.అది ఎలాగో తెలుసుకుందాం.

ఒకసారి ఒక కాపలాదారుడు ఏదో పనిమీద పొరుగూరికి వెళ్ళవలసి వచ్చింది, అందుచేత రాజువద్దకెళ్ళి, "ప్రభూ! నేను అత్యవసరంగా పొరుగూరికి వెళ్ళవలసి వచ్చింది.

ఈ రాత్రికి నా కుమారుడు మూగవాడైనప్పటికీ ఊరి కాపలా కాస్తాడు, ఇందుకు అనుమతించండి" అని వేడుకొన్నాడు, రాజు అందుకు సమ్మతించాడు.

ఈ మూగవాడు ఎలా కాపలా కాస్తాడో చూడాలనే ఆశతో రాజు మారువేషంలో గమనించాలనుకొన్నాడు.

ఆ కాలంలో రాజులు మారు వేషంలో రాత్రిళ్ళు సంచారం చేసి ప్రజల బాగోగులు స్వయంగా పరిశీలించడం రివాజుగా ఉండేది! ... రాత్రి అయింది.

అది మొదటి యామం, తప్పెట చేతపుచ్చుకొని ఆ బాలుడు వీధి కాపలా కాయసాగాడు, రాజు అతణ్ణి వెంబడించసాగాడు, హెచ్చరిక చేసే సమయం వచ్చింది.

అప్పుడు మూగవాడు ఆ బాలుడు తప్పెట కొడుతూ ఇలా చెప్పాడు:

"కామం క్రోధంచ - లోభంచ - దేహేతిష్ఠంతి తస్కరాః

జ్ఞానరత్నాపహారాయ - తస్మాత్ జాగృతః జాగృతః."

మన దేహంలో కామ క్రోధ లోభాలనే తస్కరులు కూర్చుని జ్ఞానమనే రత్నాన్ని అపహరించ పొంచి ఉన్నారు...

కాబట్టి జాగ్రత్త! - ఈ మాటలు విన్న రాజు ఎంతో ఆశ్చర్యపోయాడుబీ నిశ్చేష్టుడయ్యాడు.

'ఇతడు నిజానికి మూగవాడు కాడు, ముందుగానే జ్ఞాని అయిన జీవన్ముక్తుడు, ముముక్షువు.

ఒక మంచి ఆత్మ ఇతడి శరీరంలో ఉన్నది, కనుక ఇతణ్ణి వెంబడించి, గమనిస్తూ ఉంటాను' అని రాజు భావించాడు.

మళ్ళా రెండవ ఝాము వచ్చింది, అప్పుడు ఆ జ్ఞాని ఇలా చాటాడు:

**"జన్మదుఃఖం జరాదుఃఖం -**

జాయాదుఃఖం పునః పునః సంసార సాగరం దుఃఖం - తస్మాత్ జాగృతః జాగృతః."

పుట్టడం దుఃఖం, చావడం దుఃఖం, జరాభయం దుఃఖం, సంసార సాగరం దుఃఖం, మళ్ళా మళ్ళా వచ్చేవి కాబట్టి జాగ్రత్త - అని హెచ్చరిక.

ఈ శ్లోకాన్ని విని రాజు పరవశుడైనాడు, తృతీయ యామం వచ్చింది:

"మాతానాస్తి - పితానాస్తి - నాస్తి బంధు సహోదరః

అర్థంనాస్తి - గృహంనాస్తి - తస్మాత్ జాగృతః జాగృతః"

తల్లి లేదు, తండ్రి లేదు, బంధువులు లేరు, సహోదరులు లేరు, ధనంలేదు, గృహం లేదు (ఇదంతా మిథ్య అని అర్థం) జాగ్రత్త! జాగ్రత్త! - అని చాటాడు.

ఇది విన్న రాజు అచేతనుడయ్యాడు, అయినా వెంబడిస్తూనే ఉన్నాడు...

ఇంతలో నాలుగవ యామం వచ్చింది, అప్పుడు ఆ బాలుడు...

"ఆశయా బధ్యతే లోకే - కర్మణా బహుచింతయా

ఆయుఃక్షీణం - నజానాతి - తస్మాత్ జాగృతః జాగృతః."

అని చాటింపు వేశాడు.

ఆశాపాశంచేత కట్టుబడి తిరుగుతూ లోక కర్మల చేత బహుచింతలకు లోనై ఆయువు క్షీణించడం ఎరుగలేరే! కాబట్టి జాగ్రత్త జాగ్రత్త - అని చాటాడు...

ఈ చివరి శ్లోకాన్ని విన్న రాజు మనస్సు పులకించిపోయింది, అతడు సాధారణ ఊరి కాపరి కాడు.

పవిత్రమైన ఆత్మగల్గిన జీవన్ముక్తుడు, అజ్ఞానమనే చీకట్లు ఆవరించినవారికి దారి చూపించే మహానుభావుడు.

కాబట్టి ఈతణ్ణి తన రాజప్రాసాదానికి రావించి అతడికి ఇష్టమైన ఉద్యోగం ఇప్పించాలి అని నిర్ణయించుకొని రాజు తన నగరికిపోయాడు.

మర్నాడు ఆ బాలుని తండ్రి రాజును చూడవచ్చాడు...

అతడితో రాజు ఇలా అన్నాడు: "ఇంతదాకా మూగగా ఉన్న నీ కుమారుడు నిజానికి మూగ కాడు.

అతడు పూర్వజన్మజ్ఞానం ఉన్న మహనీయుడు, పుణ్యాత్ముడు, అతడికి నా రాజ్యంలో తనకు ఇష్టమైన ఉద్యోగం ఇవ్వాలని ఆశిస్తున్నాను, నా కోరిక తీర్చమని అతడిని అడుగు."

తండ్రి తన కుమారుడికి రాజుగారి కోరిక తెలుపగా, ఆ కుమారుడు అందుకు సమ్మతించి రాజు వద్దకు వచ్చాడు.

అప్పుడు రాజు, "స్వామీ! మీరు ఏ పని చేయడానికి ఇష్టపడుతారో దాన్ని చేయమని వేడుకొంటున్నాను" అని అడిగాడు.

తన పుత్రుడు అప్రయోజకుడని ఇంతవరకు ఎంచిన తండ్రి కూడా జరుగుతూన్నది అర్థం కాక ఆశ్చర్యపోతున్నాడు.

అప్పుడు ఆ జీవన్ముక్తుడు, "రాజా! మీ రాజ్యంలో ఘోరపాపం, హత్యలు చేసినవారికి ఏం శిక్ష విధిస్తారు?" అని అడిగాడు.

అందుకు రాజు "మరణ శిక్ష" అని బదులిచ్చాడు.

"అయితే ఆ మరణదండన నెరవేర్చే ఉద్యోగం నాకు ఇప్పించండి.

నా చేతులమీద, నా కత్తితో వారి తల తీస్తాను అంటూ తన కోరికను తెల్పాడు ఆ పసివాడు.

రాజు అమితాశ్చర్యపోయాడు, అతడి కోరిక మేరకు అందుకు సమ్మతించాడు.

ఊరికి వెలుపల మరణశిక్ష నెరవేర్చే స్థలంలో ఒక కుటీరం వేసుకొని ఆ బాలుడు తన కర్తవ్యాన్ని నిర్వహించసాగాడు,

ఇలా కొంతకాలం గడిచింది.

దేవలోకంలో యమధర్మరాజు ఒకరోజు చింతాక్రాంతుడై బ్రహ్మ దేవుణ్ణి దర్శించబోయాడు.

"ఎందుకు విచారిస్తున్నావు? నీ ధర్మం సక్రమంగా నెరవేరుతూన్నది కదా?" అని యముణ్ణి, బ్రహ్మ అడిగాడు.

అందుకు యమధర్మరాజు దీర్ఘంగా నిట్టూర్చి ఇలా అన్నాడు: "ఓ బ్రహ్మదేవా! ఏం చెప్పమంటావు? పాపాత్ములు నా లోకం చేరగానే వారి యాతనా శరీరాన్ని వారివారి కర్మానుసారంగా శిక్షిస్తాను కదా! కాని ఇప్పుడు ఎందుచేతనో చాలకాలంగా పాపాత్ములు కర్మను అనుభవించడానికి రావడం లేదు.

నా ధర్మ నిర్వహణ జరగడం లేదు, మరి భూలోకంలో పాపాత్ములే లేరా! లేకుంటే పాపాత్ములు మరెక్కడికైనా పోతున్నారా? నాకు అవగతం కాకున్నది, ఇదే నా విచారానికి కారణం."

బ్రహ్మకి ఇది విచిత్రంగా తోచింది.

దీన్ని పరిశోధించే నిమిత్తం భూలోకానికి వచ్చాడు.

అక్కడ రాజు నేరస్తులకు మరణదండన విధిస్తూ ఉన్నాడు.

వారు మన జీవన్ముక్తుడి వద్దకు మరణశిక్ష అమలుపరచడానికై కొనిరాబడుతూన్నారు.

ఈ తతంగం చూసి బ్రహ్మ వారిని వెంబడించి మన జ్ఞాని నివసిస్తూ ఉన్న చోటుకు వచ్చాడు.

అప్పుడు అక్కడ జరుగుతూన్నది చూడగా బ్రహ్మదేవుడికే ఆశ్చర్యం వేసింది...

**అదేమంటే:..**

మరణశిక్ష అమలు జరిగే ఆ వేదికకు ఎదురుగా శివుడు, విష్ణువుల దివ్యమంగళమూర్తుల పటాలు అమర్చి ఉన్నవి.

అందంగా పుష్పాలంకారం చేసి అంతటా సుగంధం నిండగా ధూపదీపాలు పెట్టబడినవి, చూసేవారి మనస్సు భక్తిపరిపూరితమై చేయెత్తి నమస్కరించాలనే రీతిలో నేత్రానందకరంగా ఉంది...

అంతేకాక ఆ పటములకు ముందు పురాణాలు, కావ్యాలు, రామాయణ భారత భాగవతాది పవిత్ర గ్రంథాలు అమర్చబడి ఉన్నాయి.

ఆ చోటు దేవాలయమేగాని మరణాలయంగా కానరాకున్నది...

మరణశిక్ష విధింపబడి కొనిరాబడినవారికి ఆ జ్ఞాని తాను తల తీయడానికి ముందు ఆ పటముల ఎదురుగా వారిని నిలబెట్టి నమస్కరింపచేసి, వారి మనస్సు అర్థమయ్యే రీతిలో నీతులు, భగవంతుడి నామమహిమ, సంకీర్తనం మధురంగా చెబుతున్నాడు...

అతడి మాటలు ఆలకిస్తూ వారు సర్వమూ మరచి, తనువు తన్మయమవుతూ ఉన్న తరుణం చూసి వారికే తెలియకుండా వెనుక ప్రక్కనుంచి వారి తల ఖండించేవాడు.

అయితే ఆ తల తెగుతున్నప్పుడు వారు మైకంలో ఉన్నట్లుగా గుర్తించలేకపోయేవారు...

దైవనామ సంకీర్తనం చెవుల్లో పడేటప్పుడు వారి జీవం పోవడంతో వారి మనస్సు ప్రక్షాళితమై, ముక్తి పొందేవారు.

ఈ తతంగం అంతా చూసిన బ్రహ్మదేవుడు ముగ్ధుడై మన జ్ఞాని ముందు ప్రత్యక్షమయ్యాడు.

బ్రహ్మను చూడగానే జ్ఞాని సంతోషంతో నమస్కరించాడు.

"వత్సా!! ఎవరూ కనీ వినీ ఎరుగని రీతిలో మరణ దండన ఇలా నెరవేర్చడంలో అంతరార్థం ఏమిటి? ఎందువల్ల ఇలా చేస్తున్నావు, అని బ్రహ్మ, జ్ఞానిని అడిగాడు.

అందుకు అతడు వినమ్రంగా బ్రహ్మతో ఇలా పలికాడు: ...

ఓ బ్రహ్మదేవా! మీకు తెలియనిదంటూ ఏదన్నా ఉంటుందా?

నా గత జన్మలోమరణ సమయంలో దైవనామ స్మరణకు బదులు కలిగిన తలంపుల వలన నాకిలా జన్మించాల్సి వచ్చింది.

భగవానుడు గీతలో 'ఎంతటి క్రూరకర్ముడైనా ఎవడు మరణ సమయంలో నా నామస్మరణ చేస్తాడో వాడు నా సాన్నిధ్యం పొందుతాడు' అని సెలవిచ్చాడు !!!...

కాబట్టి సులభోపాయంలో వీరినందరినీ దైవనామ స్మరణతో ముక్తులను చేయదలచాను, నా అనుభవం ఒక పాఠమైనది."

అంతా విన్న బ్రహ్మదేవుడు పరిపూర్ణ సంతృప్తి, ఆనందాలతో అతణ్ణి ఆశీర్వదించి సత్యలోకం చేరుకొన్నాడు.

మరణకాలంలో సత్ చింతనతో ఉంటే అలాంటి పుట్టుకే లభిస్తుంది, లేక ముక్తి లభిస్తుంది.

సత్ చింతన కాక వేరే ఏ చింతన అయినా ఉంటే అందుకు సంబంధించిన పునర్జన్మ కలుగుతుంది.

కాబట్టి అంత్యకాలంలో భగవన్నామమే పరమ ఔషధంగా పనిచేస్తూన్నది...

నామస్మరణే సులభోపాయం, ఆ నామస్మరణే ధన్యోపాయంగా చేసుకొని కడతేరే మార్గం చూసుకొందాం గాక!

కావున మరణ సమయము ఎవరికి ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియదు కావున భగవన్నామ స్మరణ నిత్యము అన్ని వేళలలో ఏ పని చేస్తున్నా మానసికముగా చేస్తూ ఎదుటి మనిషిలో ఉన్న భగవంతుని గౌరవిస్తూ ప్రవర్తిస్తే తప్పకుండా అంత్యకాల నామ స్మరణ తప్పక లభిస్తుంది.

భగవద్గీత లో చెప్పినటుల "అద్వేష్టా సర్వ భూతానాం" ఆచరించుతూ ఉంటేనే ఇది సాధ్యము.

ఏ ఒక్కరి మీద ద్వేషము లేని వారికే ఇది సుసాధ్యము...

ఎందుకనగా తను వేరొకరిని ద్వేషించే సమయములో ఒకవేళ మరణము సంభవస్తే అదే ద్వేషముతో పాము-కప్ప జన్మలను, మరియు గజ-కచ్ఛప (ఏనుగు-తాబేలు) జన్మలను పొంది అనేక యుగములు తగవులాడుకొనే అవకాసము ఉన్నదని పురాణములు చెప్పుచున్నవి. కావున మొట్టమొదలు మనము శత్రువులు అనుకునే వారిమీద మన అభిప్రాయములను సరిదిద్దుకుని "అద్వేష్టా సర్వభూతానాం" గా తయారు అవడము అత్యంతావశ్యకము.

నిత్యము రామనామ స్మరణ చేసిన వాల్మీకి మహర్షి అంత్య సమయములో కూడా రామ నామ స్మరణ చేయడము వలన తులసీదాసు గా జన్మించగనే (1498-1623) అందరు పిల్లలవలె ఏడవకుండా "రామ్ రామ్" అని పలకడము అందుకని మొదలు ఆయన పేరు "రాంబోలా" అని అందరూ పిలవడము జరిగినది.ఇంతకన్నా మనకు ఏమి ఉదాహరణ కావాలి.... మిత్రులారా!

# క్రీడా సమాచారమ్

## ఇంగ్లాండ్‌తో టెస్టుల్లో కరుణ్ నాయర్ ఉండాల్సిందే: రాయుడు



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్‌లోకి పునరాగమనం చేసి అద్భుతమైన ఇన్నింగ్స్‌తో కరుణ్ నాయర్ ఆకట్టుకున్నాడు. దిల్లీ తరఫున బరిలోకి దిగిన కరుణ్ ముంబయిపై 40 బంతుల్లోనే 89 పరుగులు చేశాడు. మూడేళ్ల తర్వాత నాయర్ ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. 2018 తర్వాత తొలి హాఫ్ సెంచరీ కావడం గమనార్హం. గతేడాది దేశవాళీ సీజన్‌లో కరుణ్ నాయర్ భారీగా పరుగులు రాబట్టాడు. దీంతో అతడిని మళ్లీ జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లూ పెరిగాయి. ఇప్పుడీ ఇన్నింగ్స్‌తో కరుణ్‌ను ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేయాలని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వ్యాఖ్యానించాడు.

"కరుణ్ నాయర్ పట్టుదల అద్భుతం. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఎదుర్కొనేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలి. కెరీర్‌లో ప్రతి క్రికెటర్‌కూ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. దానిని తట్టుకోవడం తేలికేం కాదు. చాలా తక్కువమంది మాత్రమే ఇలాంటి వాటి నుంచి బయటపడ్డారు. ఈ జాబితాలో కరుణ్ నాయర్ ఉంటాడు. ఎందుకంటే భారత దేశవాళీ సిస్టమ్ దెబ్బతింటే మాత్రం కరుణ్ నాయర్ వంటి క్రికెటర్లు మళ్లీ పునరాగమనం చేసేందుకు సిద్ధమయ్యేవాళ్లే కాదు. మన చుట్టూ ఎన్నో అంశాలు మానసికంగా ప్రభావం చూపిస్తాయి. క్రికెట్ అనేది చాలా త్వరగా మారిపోయే క్రీడ. ఎన్నో మార్పులు వస్తుంటాయి. కరుణ్ నాయర్ మాత్రం తన ఆశయంలో మార్పు లేదని నిరూపించాడు. ఎప్పుడూ కష్టపడటాన్ని వదల్లేదు. తప్పకుండా జాతీయ జట్టుకు మళ్లీ ఆడతాననే నమ్మకంతో ఉన్నాడు. టెస్టుల్లోకి పునరాగమనం కోసం సిద్ధమయ్యాడు. అందుకే, ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు కరుణ్‌ను ఎంపిక చేయాలి. అతడికి అర్హత ఉందని భావిస్తున్నా" అని రాయుడు వెల్లడించాడు. ఇంగ్లాండ్‌తో జూన్ నుంచి ఐదు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఆడనుంది.

**కరుణ్ పాత ట్వీట్ వైరల్**

మూడేళ్ల కిందట తన అంతర్జాతీయ క్రికెట్ పునరాగమనంపై కరుణ్ చేసిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. 'డియర్ క్రికెట్.. నాకు మరొక ఛాన్స్ ఇవ్వు' అని 2022లో పోస్టు పెట్టాడు. తాజాగా ముంబయితో మ్యాచ్ అనంతరం దిల్లీ క్యాపిటల్స్ కూడా ఆ ఇమేజ్‌ను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. దిల్లీ 12 పరుగుల తేడాతో ఓడినప్పటికీ కరుణ్ పోరాటం మాత్రం ఆకట్టుకుంది. సెంచరీకి చేరువగా వచ్చిన తన టీమ్‌ను గెలిపించేందుకు తీవ్రంగానే ప్రయత్నించాడు. 'ఇంపాక్ట్' ప్లేయర్‌గా ఈసారి సీజన్‌లో తొలి మ్యాచ్‌ను ఆడటం గమనార్హం.

## నా ఇన్నింగ్స్‌కు విలువే లేదు: కరుణ్ నాయర్



**ఇంటర్నెట్ డెస్క్:** కరుణ్ నాయర్ ఐపీఎల్ పునరాగమనం ఘనంగా జరిగింది. బ్యాటింగ్‌పరంగా అద్భుతంగా ఆడాడు. అయితే, తాను ప్రాతినిధ్యం వహించిన దిల్లీ క్యాపిటల్స్ కు ఓటమి ఎదురుకావడం నిరాశపరిచిందని కరుణ్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబయితో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ 12 పరుగుల తేడాతో ఓడిపోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన కరుణ్ నాయర్ 40 బంతుల్లో 89 పరుగులు చేశాడు. అయితే, ఆఖర్లో వరుసగా మూడు రనౌట్లు కావడంతో దిల్లీ పరాజయం చవిచూసింది. తన ప్రదర్శనపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు కరుణ్ నాయర్ సూపర్ సమాధానం ఇచ్చాడు.

"నా ఇన్నింగ్స్‌పై మాట్లాడటానికి ఏమీ లేదు. ఇప్పుడు పెద్ద ప్రయోజనమూ లేదు. మంచి ఆటతీరే ప్రదర్శించా. కానీ, నా టీమ్ ఓడిపోయింది. కాబట్టి, ఆ ఇన్నింగ్స్‌కు విలువే లేదు. విజయం సాధించనప్పుడు ఎంత గొప్ప ఇన్నింగ్స్ అయినా వాల్యూ ఉండదు. ఈ సీజన్‌కు ముందు నేను ఐపీఎల్‌లో ఆడతాననే నమ్మకంతోనే ఉన్నా. ఎప్పుడు అవకాశం వచ్చినా నిరూపించుకొనేందుకు సిద్ధంగానే ఉన్నా. మనసులో మాత్రం క్రీజ్‌లోకి వెళ్లాక అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాలని భావించా. ఇన్నింగ్స్‌ను వేగవంతం చేయడానికి కొన్ని బంతులు తీసుకున్నా. పవర్ ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుంది. నేను మామూలుగా ఆడే షాట్లనే కొట్టా. నాకు అన్నీ కలిసొచ్చాయి. నా బ్యాటింగ్ పరంగా సంతోషంగానే ఉన్నా. మా జట్టు విజయం సాధించి ఉంటే ఇంకా బాగుండేది" అని కరుణ్ వెల్లడించాడు.

**ఫాఫ్ లేని లోటు..**

"పవర్ ప్లేలో ఫాఫ్ డుప్లెసిస్ డేంజరస్ బ్యాటర్. అతడు లేని లోటును పూరించాల్సిన బాధ్యత నాది. బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లంతా తమ అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉన్నారని తెలుసు. అందుకే మెంటల్లీ నేను కూడా నా ఛాన్స్ కోసం సిద్ధంగానే ఉన్నా. తుది జట్టు ఎంపిక ఎప్పుడూ కఠినమే. ఆ విషయంలో మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తా. నా సన్నద్ధతను ఎప్పుడూ కొనసాగిస్తూనే ఉంటా. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా" అని వెల్లడించాడు.

## దిల్లీని దెబ్బకొట్టి.. ముంబయిని గెలిపించిన 'కర్ణ్'డు



రోహిత్ శర్మ సూచనతో కెప్టెన్ హార్దిక్ పాండ్య రంగంలోకి దింపిన ఆయుధం 'కర్ణ్' శర్మ. దిల్లీని ఓడించి.. ముంబయికి విజయాన్ని అందించిపెట్టడంలో కీలక పాత్రధారి. ముంబయిని గెలిపించడంలో మూడు రనౌట్లది కీలక పాత్రే. కాదనలేని సత్యం. కానీ, విజయం దిశగా సాగుతోన్న దిల్లీకి అడ్డుకట్ట వేసింది మాత్రం ఓ వెటరన్ స్పిన్నర్. అతడే వికెట్లు తీయకపోతే ముంబయి ఖాతాలో మరో ఓటమి పడేదే. అదే జరిగితే 'ప్లేఆఫ్స్' రేసులో వెనకబడిపోయేదే. అప్పుడొచ్చాడు 37 ఏళ్ల కర్ణ్ శర్మ ముంబయికి కలిసొచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్.

టార్గెట్ 206 పరుగులే.. ఐపీఎల్‌లో ఇదేమీ పెద్ద లక్ష్యం కాదు. ఇప్పటికే '246'ను కొట్టిన సందర్భం చూసేశాం. మరోవైపు దిల్లీ మైదానం బౌండరీ లైన్ చిన్నది. తొలి బంతికే ముంబయికి వికెట్ దక్కింది. ఇంకేముందిలే త్వరగా చుట్టేయొచ్చని అంతా భావించారు. అనుకున్నట్లే సాగితే అది క్రికెట్ ఎందుకు అవుతుంది. రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యం. ప్రత్యర్థి దిల్లీ పుంజుకొంది. ఇదే అదనుగా కరుణ్ నాయర్ (89) - అభిషేక్ పోరెల్ (33) కేవలం 10.1 ఓవర్లలోనే 119 పరుగులు రాబట్టారు. అంటే మరో 65 బంతుల్లో దిల్లీ విజయానికి 87 పరుగులే అవసరం. బ్యాటింగ్‌కు దిగాల్సిన స్టార్లు చాలామంది ఉన్నారు. స్టార్ పేసర్లు ఇబ్బందిపడ్డారు. అప్పుడు వచ్చిన కర్ణ్ శర్మ ఇన్నింగ్స్‌లో 9వ ఓవర్‌ను వేశాడు. వికెట్ తీసినంత ప్రభావం చూపించాడు. దీంతో అక్కడినుంచి ముంబయి ఆశలు పెరిగాయి. కర్ణ్ బౌలింగ్‌నే హార్దిక్ కొనసాగించాడు.

తన రెండో ఓవర్ మొదటి బంతినే అభిషేక్ సిక్స్‌గా మలిచినా.. ఏమాత్రం నిరాశ చెందని కర్ణ్ మరో ఊరించే బంతిని విసిరి బ్యాటర్‌ను బుట్టలో వేశాడు. భారీ షాట్‌కు యత్నించి నమన్ ధీర్ అద్భుతంగా ఒడిసిపట్టడంతో పోరెల్ పెవిలియన్ బాట పట్టాడు. ఇక్కడే ముంబయికి అద్భుతమైన బ్రేక్ దక్కింది. ఆ తర్వాత నుంచి స్వల్ప వ్యవధిలో వికెట్లు తీస్తూనే ఉంది. గత మ్యాచ్‌లో ఆర్సీబీపై అదరగొట్టిన కేఎల్ (15), ట్రిస్టన్ స్టబ్స్ (1)ను కూడా కర్ణ్ ఔట్ చేశాడు. మిచెల్ సాంట్నర్ సూపర్ డెలివరీతో డేంజరస్‌గా మారిన కరుణ్ నాయర్‌ను ఔట్ చేశాడు. దీంతో మ్యాచ్ ముంబయి వైపు తిరిగింది. బుమ్రా ఓవర్‌లో మూడు రనౌట్లతో హార్దిక్ సేన్ విజేతగా నిలిచింది.

**దిల్లీలో ఆడిన అనుభవం..**

దేశవాళీలో దిల్లీలో ఆడిన అనుభవం కర్ణ్ శర్మకు ఉంది. అరుణ్ జైట్లీ మైదానంలో పిచ్ ఎలా స్పందిస్తుందో అతడికి బాగా తెలుసు. మ్యాచ్ అనంతరం కూడా ఇదే మాట చెప్పాడు. మంచు ప్రభావం ఉంటుందని తొలుత ఊహించలేదని పేర్కొన్నాడు. ఇక రెండో బంతిని తీసుకోవడం కూడా ముంబయికి కలిసొచ్చింది. ఇన్నింగ్స్ 13వ ఓవర్ తర్వాత బౌలింగ్‌కు వచ్చిన కర్ణ్ తన వరుస ఓవర్లలో కేఎల్, స్టబ్స్‌ను ఔట్ చేశాడు. జట్టులో రెగ్యులర్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ఉన్నాడు. అతడూ రెండు వికెట్లు తీశాడు. దీపక్ చాహర్ (1/24) మంచిగానే బంతులేశాడు. కానీ బౌల్ట్, బుమ్రా, హార్దిక్ కాస్త ఎక్కువగా పరుగులు ఇవ్వడంతో కర్ణ్‌ను మేనేజ్‌మెంట్ రంగంలోకి దింపింది. మంచు ప్రభావం ఉన్నప్పటికీ ప్రత్యర్థి బ్యాటర్లపై కర్ణ్ ఆధిపత్యం ప్రదర్శించాడు. దేశవాళీలో ఆంధ్రాతోపాటు విదర్భకూ ప్రాతినిధ్యం వహించిన కర్ణ్ ఐపీఎల్‌లో నాలుగు టీముల్లో ఆడాడు.

**మళ్లీ ముంబయి చెంతకు..**

కెరీర్ ఆరంభంలో (2009) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు కర్ణ్ శర్మ ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత కొన్నాళ్లు ఏ జట్టూ తీసుకోలేదు. మళ్లీ 2013 నుంచి 2016 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడాడు. 2017లో ముంబయి ఇండియన్స్‌కు వచ్చాడు. అదీనూ ఒక్క ఏడాదికే పరిమితం కావడం గమనార్హం. 2018-21 మధ్య చెన్నై సూపర్ కింగ్స్‌లోనూ ఆడాడు. మళ్లీ తన పాత జట్టు ఆర్సీబీకి (2022-24) వెళ్లిపోయాడు. గత సీజన్ తర్వాత ఆ జట్టు రిటైన్ చేసుకోలేదు. మెగా వేలంలోకి వచ్చాడు. రూ. 50 లక్షల కనీస ధరకే ముంబయి తీసుకుంది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ముంబయికి వచ్చాడు. అయితే, అతడికి అవకాశం వస్తుందని కూడా ఎవరూ ఊహించలేదు. ఇప్పుడీ ఛాన్స్‌ను అద్భుతంగా ఒడిసిపట్టాడు. మిగతా బౌలర్లు విఫలమైన పిచ్‌పై 4 ఓవర్ల కోటా వేసిన కర్ణ్ 36 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మిగతా మ్యాచుల్లోనూ తనను పక్కన పెట్టొద్దని మేనేజ్‌మెంట్‌కు చిరు హెచ్చరికా జారీ చేసినట్లే.!

## సముద్రంలో గడ్డి మైదానాలు ఏర్పాటుతోనే వాతావరణ సమతుల్యత

### నలుగురు విద్యార్థులను సత్కరించిన డాక్టర్ షిరీన్ రహమాన్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వాతావరణంలో సమతుల్యత కోసం పయనీరింగ్ బ్లూ కార్బన్ ఎకోసిస్టమ్స్ లో భాగంగా సముద్ర తీరంలో గడ్డి మైదానాలను ఏర్పాటు చేసి భారతదేశం తరఫున ది క్లైమేట్ ట్యాంక్ యాక్సిలేటర్ పోటీలో గెలిచి అమెరికాలో 10రోజులు ఫెలోషిప్ మరియు వెయ్యి డాలర్ల ప్రైజ్ మనీ గెలుచుకున్న బీఎస్సీ, సీఎంబీటీ చివరి సంవత్సరం చదువుతున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు టి. హర్షిత,ఎ. తేజాంబిక్, ఎం. అశ్విని,జె. కార్తికేయ నారాయణ్ లను సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఘనంగా సన్మానించింది. ఈ విద్యార్థులు ఒడిశాలోని చిలకా లగూన్ నుండి సముద్ర గడ్డి మొక్కలైన హాలోఫిలా ఓవాలిస్ మరియు హాలోడ్యూల్ పినిఫోలియాలను సేకరించి చెక్క ఫ్రేమ్‌లను ఉపయోగించి రుషికొండ సముద్రగర్భంలో ఆ గడ్డిని నాటారు.

ఈ సందర్భంగా బుల్లయ్య కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన సభకు ముఖ్య అతిథి హాజరైన నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. బాలమోహన్ దాస్ మాట్లాడుతూ సముద్ర వాతావరణం పరిరక్షించేందుకు సముద్రంలో గడ్డి పెంచడం అవసరమన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం విద్యార్థులు ఈ ప్రాజెక్ట్ చేపట్టడం ముదావహమన్నారు. ముఖ్యంగా పాల ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ ఏ విధంగా డిస్పోజల్ చేయాలి అనే దానిపై విద్యార్థులు అధ్యయనం చేయాలని విశాఖపట్నంలో రోజూ 80 లక్షల పాల ప్యాకెట్లు వాడుతున్నారని ప్లాస్టిక్ నిషేధం నేపథ్యంలో వాటిని మటుమాయం చేసేందుకు విద్యార్థులు ప్రయత్నాలు చేయాలన్నారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ బుల్లయ్య కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు సముద్ర వాతావరణం పరిరక్షించేందుకు చేపట్టిన ప్రాజెక్టు తమకు ఎంతగానో నచ్చడంతో వారిని సత్కరించేందుకు ముందుకు వచ్చామని తెలియజేశారు. కాలుష్యంపై ఇప్పటికే పోరాడుతున్నామని సముద్ర వాతావరణం కూడా కాపాడాలన్నారు. పేదరిక నిర్మూలనకల, సామాజిక రుగ్మతలపై పోరాటం సాగిస్తున్నామని ఈ నేపథ్యంలోనే 1987లో తమ సంస్థ ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఆచార్య శివరామకృష్ణారావు మాట్లాడుతూ విశాఖపట్నంలో పోర్ట్ ట్రస్ట్ వల్ల కాలుష్యం వెదజల్లుతున్న మాట వాస్తవమేనని ఈ నేపథ్యంలో పొల్యూషన్ను అరికట్టేందుకు పోర్టుతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ జి. ఎస్. కె.చక్రవర్తి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు రెండు అంశాల్లో పోటీ పడినప్పటికీ సముద్రంలో గడ్డి పెంపకంకు విద్యార్థులకు అవార్డు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలోకళాశాల కార్యదర్శి జి.మధుకుమార్, సోమేశ్వరరెడ్డి, మెంటర్లు మాధవి, శైలజ, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నలుగురు విద్యార్థులను డాక్టర్ షిరీన్ రహమాన్ ఘనంగా సన్మానించారు.

## కుమారపురం గ్రామంలో ఘనంగా అంబేద్కర్ 134 జయంతి వేడుకలు

**కాకినాడ రూరల్ (విశాఖ సమాచారమ్) :-** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలు పిఠాపురం మండలం కుమారపురం గ్రామం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హౌసింగ్ డీఈ కందవల్లి సూరిబాబు సర్పంచ్ నల్ల రాంబాబు ఎంపీటీసీ ఈరుగుల ప్రమీల ప్రసాద్ హాసిన్లుయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రిటైర్డ్ ఉద్యోగి ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ బచ్చుల సంజీవరావు మాట్లాడుతూ అంబేద్కర్ జీవిత ఆశయాల కోసం మరియు ఆయన బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి పాటు పడిన విషయాలను అందరితోను పంచుకున్నారు. గ్రామ పెద్దలు నాయకులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా గ్రామంలోని ప్రజలందరూ అంబేద్కర్ జయంతి వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. అలాగే అంటరానివానిగా ఆరంభమైన అంబేద్కర్ అందరివాడిగా ఎదిగి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారని అన్నారు. అంబేద్కర్ కు విద్యపై ఉన్న ఆసక్తితో బాంబే, కొలంబియా, లండన్ యూనివర్సిటీలలో ఉన్నత విద్యను అభ్యసించారని చెప్పారు. న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా భారతదేశానికి ఎనలేని కృషి చేస్తారని తెలిపారు. స్త్రీ విద్యకు ఎక్కువ ప్రాధన్యతనిచ్చారని, తెలియజేసారు. విద్య, విజ్ఞానానికి సంబంధించి అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలని చెప్పారు. వివాదాలు, విభేదాల వైపు కాకుండా మంచిని స్వీకరించి, దానిని అనుసరించి జీవించాలన్నారు. వివిధ, జాతులు, మతాలు



ఉన్న భారతదేశానికి అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దిక్సూచిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు నాళం నాగేశ్వరరావు, డైరెక్టర్ నెక్కల సత్యనారాయణ (చిన్న), టిడిపి నాయకుడు పిఠాపురం మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ నెక్కల సత్యనారాయణ, మాజీ సర్పంచులు మర్రి జగ్గారావు, ఎస్ వరహాలు, మాజీ ఎంపీటీసీ ఎలుగుబంటి ప్రభు, గ్రామ పెద్దలు నాళం నారాయణరావు, ఈరుగుల సత్తిరాజు, యేసు రత్నం, జనసేన నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.


MGT2
Meet, Greet & Treat
Meet • Greet • Treat
Fun • Fellowship • Friendship



on 22nd April, 2025, from 9:00 am to 6:00pm
Venue: 3rd Floor, Alluri Seetharamaraju Vignana Kendram, Dabagardens, Visakhapatnam.
A Day Out for SENIOR CITIZENS to foster Fun, Fellowship & Friendship
Organised by : CONCERN Charitable Trust & Vizag Children's Club
In association with Alluri Seetharama Raju Vignana Kendram

Events at a glance

GROUP EVENTS
- Musical Chairs
- Ball & Bucket
- Stick Bindi Blindfolded
- Grouping game

INDIVIDUAL EVENTS
- Singing
- Dance
- Mimicry
- Comedy
- Puzzles & Jokes

Body & Mind Games
- Brain Gym exercise
- Mobility exercise on chair
- Memory test

OTHER ATTRACTIONS
- Lucky Dip every half an hour
- Surprise Gifts
- Competition Prizes





Which includes Breakfast, Lunch, Tea / Coffee & Snacks, Competition prizes, Lucky dip, Surprise gifts etc.
Dr. P. K. Jose 9440156638
Dr. K. Rama Prabha 9492348428
S. Veerabhadra Rao 9393949345
Hearty welcome to all the Senior Citizens


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com